# కొమరోలులో వ్యాపార సంస్థలపై తూనికల

# కొలతల అధికారుల ఆకస్మిక దాడులు

**ముందస్తు సమాచారంతో దుకాణాలను మూసివేసిన పలువురు వ్యాపారస్తులు.**

**మూడు కేసులు నమోదు చేసిన లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ షేక్ మొహిషిన్.**





**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 23**

కొమరోలు పట్టణంలోని వ్యాపార సంస్థలపై మార్కాపురం డివిజన్ ఇన్చార్జి లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ షేక్ మొహిషిన్ శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. అయితే తనిఖీ అధికారులు వచ్చే సమాచారాన్ని ముందుగానే తెలుసుకున్న వ్యాపారస్తులు తమ దుకాణాలను ముందస్తుగా ఆగమేఘాల మీద మూసివేశారు. దుకాణాల మూసివేతతో ఆశ్చర్యం వ్యక్తం చేసిన మొహిసిన్ పట్టణానికి చివర గల సూపర్ మార్కెట్ తోపాటు రెండు కిరాణా దుకాణాలను తనిఖీ చేశారు. సూపర్ మార్కెట్లో తనిఖీ చేయగా చక్కెర ప్యాకెట్ పై ఎలాంటి చిరునామాల స్లిప్పు అంటించలేదని,,అంతేగాక మరికొన్ని రకాల ప్యాకెట్లపై కూడా ఎలాంటి చిరునామాలు లేనట్లుగా గుర్తించామని ఆయన తెలిపారు. దీనితో సూపర్ మార్కెట్ యజమానికి 4,000 రూపాయల అపరాధ రుసుము విధించామని ఆయన తెలిపారు. 2011 చట్టం ప్రకారం ప్రతి ప్యాకెట్ పై ఎంఆర్పి రేటు, వస్తువు ప్రారంభ తేదీ, ముగింపు తేదీ ,ఈమెయిల్ అడ్రసు, కస్టమర్ కేర్ నంబరు తదితర ఆరు రకాల వివరాలతో కూడిన స్లిప్పులను ప్యాకెట్లపై తప్పనిసరిగా అతికించవలసి ఉన్నదని ఆయన తెలిపారు. అయితే సూపర్ మార్కెట్లోని పాకెట్ల పై అలాంటి స్లిప్పులు లేవని ,అందువల్ల ఆ షాప్ పై కేసు నమోదు చేశామని తెలిపారు. కాగా కొమరోలు లోని మరో రెండు కిరాణా షాపులను తనిఖీ చేయగా ఆ షాపులలో కూడా ప్యాకెట్లపై చిరునామాల స్లిప్పులు కనిపించలేదని, దీనితో ఆ రెండు షాపులపై కూడా కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు .త్వరలో ఆ రెండు షాపులకు కూడా అపరాధ రుసుం విధిస్తామని ఆయన వివరించారు. వ్యాపారస్తులు తమ వ్యాపార సంస్థలలో ఎలక్ట్రికల్ కాటాలను ఉపయోగించాలని, అంతేగాక ఎలక్ట్రికల్ కాటాలకు సంవత్సరంలోపు,సాధారణ కాటాలకు రెండు సంవత్సరాలలోపు రెన్యువల్ చేయించుకుని, ముద్రలు వేయించుకొని అందుకు సంబంధించిన రసీదులు పొందాలని ఆయన వ్యాపారస్తులకు సూచించారు. తూకాలు , కొలతలలో ఎలాంటి అక్రమాలు జరిగినట్టు గుర్తించిన వెంటనే తమకు సమాచారం అందించాలని, ఆ మేరకు తాము దాడులు చేసి అవినీతి అక్రమాలకు పాల్పడే వ్యాపార సంస్థల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని మొహిషిన్ పేర్కొన్నారు. తూనికల కొలతల అధికారి రాక సందర్భంగా దుకాణాలను మూసివేయటంపై ఆయనను పెన్ పవర్ ప్రతినిధి ప్రశ్నించగా ,తాము శనివారం మధ్యాహ్నం వరకు కంబం పట్టణంలో దుకాణాలు తనిఖీ చేశామని, దీనితో కంభంలోని వ్యాపారస్తులు కొమరోలు లోని వ్యాపారస్తులకు తమ రాక గురించి సమాచారం అందించి ఉంటారని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే తూనికల కొలతల అధికారులు రాకను గమనించి ముందస్తుగా దుకాణాలను మూసివేయడం గత చాలా కాలంగా జరుగుతున్నదని ,దీనితో వినియోగదారులు పలు రకాల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కొమరోలు లోని ఐరన్ షాపులు, సిమెంట్ షాపులు ,బేకరీల తోపాటు కొన్ని రకాల వ్యాపార సంస్థలలో కొలతలు తూకాలలో అక్రమాలు జరుగుతున్నప్పటికీ వాటిని నివారించే వారే కరువయ్యారని పలువురు వినియోగదారులు విచారం ,ఆవేదన నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఎలక్ట్రికల్ కాటాలలో కూడా చిప్స్ పెట్టి అవినీతి అక్రమాలకు పలువురు వ్యాపారస్తులు పాల్పడుతున్నట్లుగా వారు ఆరోపిస్తున్నారు . దుకాణాలను తనిఖీ చేసిన కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్ పవర్
ప్రకాశం

# టంగుటూరి స్ఫూర్తిగా రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలి

**రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఆగష్టు 22**

ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని మనందరం రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతిని పురస్కరించుకుని శనివారం ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో ఉన్న ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, శాసన మండలి సభ్యులు భూమిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి, సంతనూతలపాడు శాసన సభ్యులు బి.ఎన్. విజయకుమార్, మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఎపి మాల వెల్ఫేర్ కార్పోరేషన్ చైర్మన్ డా విజయకుమార్, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ లతో కలిసి మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా టంగుటూరి ప్రకాశం పంతులు మునిమనుమడు సంతోష్ కుమార్ ను శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీఎం కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ పింగళి పాండురంగారావు రచించిన జాతీయ స్థాయి ధీరుడు టంగుటూరి ప్రకాశం పుస్తకాన్ని మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి విలేకరులతో మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాటంలో తనదైన ముద్ర వేసిన ధీరుడు టంగుటూరి అన్నారు. న్యాయవాదిగా ఎంతో ప్రాక్టీసు ఉన్నా స్వాతంత్ర్య పోరాటం కోసం త్యాగం చేసిన వ్యక్తి టంగుటూరి అన్నారు. ఆయన త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతి, వర్ధంతులను ఘనంగా నిర్వహిస్తోందన్నారు. ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతిని పురస్కరించుకొని శనివారం ఒంగోలు కలెక్టరేట్లోని వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగిందన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు రాష్ట్రం కోసం, దేశం కోసం చేసిన సేవలను స్మరించుకుంటూ నేటి యువత వారిఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సంతనూతలపాడు శాసన సభ్యులు బి.ఎన్. విజయకుమార్ మాట్లాడుతూ, టంగుటూరి ప్రకాశం పంతులు నుంచి మనం నేర్చుకోవాల్సింది త్యాగ గుణం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, డ్వామా పిడి జోసెఫ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా వెంకటేశ్వర రావు, డిటిసి సుశీల, డిసిఓ పద్మశ్రీ, డిఆర్డిఎ పిడి నారాయణ, మునిసిపల్ కమీషనర్ కోడూరి. వెంకటేశ్వర రావు, తహసీల్దార్ పిన్నిక మధుసూదన్ రావు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# యువత టంగుటూరి ప్రకాశం పంతులుని ఆదర్శంగా తీసుకోవాలి

**- జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ**

**-వాడవాడలా ఆంధ్ర కేసరి 154వ జయంతి వేడుక**

**- టంగుటూరి కి పలు సంఘాల ఘన నివాళులు**

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఆగష్టు 23**

పౌరుషం, త్యాగం, ప్రతిభకు ప్రతీకగా నిలిచిన టంగుటూరి ప్రకాశం పంతులు గారిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. ఆంధ్ర కేసరి 154వ జయంతిని పురస్కరించుకుని శనివారం దేవరంపాడులోని స్థూపం వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ప్రకాశం పంతులు, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం జాతీయ జెండాను ఆయన ఎగురవేశారు. ఈ సందర్భంగా స్థానికులను ఉద్దేశించి జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. దమ్ముంటే కాల్చాలంటూ బ్రిటిష్ వారి తుపాకులకు ఎదురు నిలిచిన ధీశాలి ప్రకాశం పంతులుగారు అని కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధునిగా, ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు తనదైన ముద్ర వేశారని ఆయన అన్నారు. అంతటి గొప్ప వ్యక్తి, త్యాగశీలి అయిన ప్రకాశం పంతులు జయంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సవాళ్లకు ఎదురొడ్డి ధైర్యంగా ముందుకు సాగిన ప్రకాశం పంతులు ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని, తాము ఎంచుకున్న రంగంలో విజేతలుగా నిలవాలని జాయింట్ కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ స్మారకం వద్ద రెండు ఎకరాల విస్తీర్ణంలో డ్వామా ఆధ్వర్యంలో పల్లెవనం ఏర్పాటు చేయిస్తామని ఆయన ప్రకటించారు. స్థూపం చుట్టూ పెండింగ్ లో ఉన్న ప్రహరీ గోడ నిర్మాణాన్ని కూడా త్వరలో పూర్తి చేయిస్తామని తెలిపారు. మాల కార్పొరేషన్ చైర్మన్ పి.విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేలా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దృష్టికి తీసుకు వెళతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిపిఓ గొట్టిపాటి వెంకట నాయుడు, డ్వామా పిడి జోసఫ్ కుమార్, ఒంగోలు ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, పలువురు మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.










**జిల్లా ఎస్పీ కార్యాలయంలో...**

స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి బిరుదాంకితుడు టంగుటూరి ప్రకాశం పంతులు 154 వ జయంతిని పురస్కరించుకుని జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ, పోలీస్ అధికారులు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన అర్పించి, ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రకాశం పంతులు జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన జాతికి చేసిన సేవలను గుర్తుగా 1972 డిసెంబర్ 5న ఒంగోలు జిల్లా పేరును ప్రకాశం జిల్లాగా మార్చారని, అలాంటి మహనీయులైన ప్రకాశం పంతులు జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ కె. శ్రీనివాసరావు , ఎస్బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, పీసీఆర్ ఇన్స్పెక్టర్ దుర్గ ప్రసాద్, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**వైకాపా కార్యాలయంలో...**

స్వాతంత్ర్య సమరయోధులు ఉమ్మడి ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకొని స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం లో ప్రకాశం పంతులు చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఆంధ్రకేసరి గా టంగుటూరి ధీయుక్తిని నాయకులు కీర్తించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా పార్లమెంట్ పరిశీలకులు బత్తుల. బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ చుండూరి రవిబాబు, వై. ప్రసాద్ రెడ్డి,ప్రసన్న,రాజీవ్, నాగరాజు,అమర్, పులుసు సురేష్ ,పీటర్,పార్టీ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ..**

టంగుటూరి 153 వ జయంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్ర ఉద్యమ పోరాటంలో బ్రిటిష్ వారి తుపాకీ కి ఎదురు నిలిచి గుండె చూపిన ధైర్యశాలి, ఆంధ్రుల ఆవేశానికి, ఆత్మవిశ్వాసానికి ప్రతీక టంగుటూరు ప్రకాశం పంతులునీ, ఆయన తెగువ, ధైర్యం, పోరాట స్ఫూర్తి, త్యాగం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా అన్నారు. అనంతరం నగరంలోని ప్రకాశం భవనం ప్రాంగణంలో ఉన్న ఆయన కాంస్య విగ్రహానికి, పూలమాలతో పూలమాల ఘటించి వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక ,కర్షక కాంగ్రెస్ అధ్యక్షులు దర్శి నియోజక వర్గ సమన్వయకర్త కైపు వెంకట కృష్ణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గోరంట్ల కోటేశ్వరరావు,జిల్లా లీగల్ సెల్ చైర్మన్ సుధర్శి రవి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు ఇరిగినేని వెంకట నరసయ్య, షేక్ రవూఫ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్, మద్దిపాడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గురు బాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ...**

35 వ డివిజన్ కార్పొరేటర్ ఆదిపూడి గిరిజ సంకర శాండిల్య అధ్యక్షతన టంగుటూరి ప్రకాశం పంతులు 154 వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం లో

ఒంగోలు మునిసిపల్ కమీషనర్ పాల్గొన్నారు. లాయర్ పేట సాయిబాబా గుడి దగ్గర గల ప్రకాశం పంతులు విగ్రహానికి కమిషనర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు లోని బ్రాహ్మణా ప్రముఖులు టి.వి. శ్రీరామ మూర్తి, కామరాజుగడ్డ కుసుమ కుమారి, ధేనువుకొండ సుబ్బయ్య, తెదేపా నాయకులు జివిఎస్ఆర్ చౌదరి, కత్తుల శివశంకర్, మారుతీ వాసు, వంశీ పాల్గొన్నారు.

# గడ్డి మందు తాగి యువకుడు ఆత్మహత్య



**అర్థవీడు, పెన్ పవర్ , ఆగస్టు 23**

ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం మోహిద్దిన్ పురం గ్రామంలో శుక్రవారం విషాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మల్లీశ్వరుడు అనే యువకుడు గడ్డి మందు తాగి గుంటూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత నెల 31వ తేదీన గడ్డి మందు తాగిన మల్లేశ్వరుడు 23 రోజుల తర్వాత చికిత్స పొందుతూ మృతి చెందినట్లుగా పోలీసులు తెలిపారు. వ్యాపారం కోసం కుటుంబ సభ్యులను ఆర్థిక సహాయం చేయాలని మల్లీశ్వరుడు అడగగా అందుకు నిరాకరించడంతో గడ్డి మందు తాగినట్లుగా కుటుంబ సభ్యులు తెలిపారు.

# పొలం బడి కార్యక్రమం నిర్వహణ ఏవో షేక్. మహమ్మద్







**పెన్ పవర్, కంభం ఆగస్టు 23**

రైతులు వ్యవసాయ సూచనలు పాటించాలని వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు. శనివారం కంభం మండలంలోని నర్సిరెడ్డిపల్లి గ్రామంలో ఉండి గ్యాప్ పొలంబడి కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఇందులో భాగంగా మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ మాట్లాడుతూ తురిమెళ్ళ రెవెన్యూ గ్రామ పరిధిలో కంది పంట సాగుచేసిన 30 మంది రైతులను ఎంపిక చేసుకొని వారికి 14 వారాలు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆరోగ్యవంతమైన నాణ్యమైన అధిక దిగుబడులు సాధించుటకు మెలికలు తెలియజేయడం జరుగుతుందని తెలియజేశారు. అంతేకాకుండా సేంద్రియ వ్యవసాయం పద్ధతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ద్వారా పంటల ఉత్పత్తి, పురుగుమందులు లేని వ్యవసాయ ఉత్పత్తులు లక్షంగా పొలంబడి కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. ముందుగా మట్టి నమూనాల సేకరణ వంటి అంశాలను ప్రత్యక్షంగా ప్రదర్శన చేసి చూపించడం జరిగినది, ఈ కార్యక్రమంలో తురిమెళ్ళ , నల్ల కాలువ గ్రామ వ్యవసాయ సహాయ యకులు ప్రశాంత్ ,సాయి రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో ప్రకాశం పంతులు జయంతి వేడుకలు



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 23**

స్వాతంత్రియ సమరయోధుడు ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు చిరస్మరణీయమని కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ పి వీరన్న గౌడ్ అన్నారు. శనివారం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా డీన్ వీరన్న గౌడ్ ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీన్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు న్యాయవాదిగా పనిచేస్తూ స్వాతంత్ర ఉద్యమంలో బ్రిటిష్ వారిని గడగడలాడించిన చరిత్ర ప్రకాశం పంతులుదని ఆయన అన్నారు.ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన నీతి నిజాయితీలతో పనిచేశారని ఆయన అన్నారు.ప్రకాశం పంతులు జీవితం నేటి యువతకు ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రులకు గర్వకారణం.."ఆంధ్ర కేసరి

## ప్రాణాలకు తెగించి సర్వం త్యజించి పోరాడిన భరతమాత ముద్దుబిడ్డ,

## తెలుగువారి తెగువకు ప్రతిరూపం. "టంగుటూరి" -జన విజ్ఞానవేదిక రాష్ట్ర నాయకులు-పి.స్వరూప రెడ్డి






**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 23**

ధైర్య సాహసాలకి మారుపేరుగా ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు నిలుస్తారు.ఆంధ్ర ప్రజల ఆవేశానికి, అకుంఠిత ధైర్యసాహసాలకు, అసమానత్యాగనిరతికి ప్రతినిధి ప్రకాశం పంతులు.అన్యాయాన్ని అక్రమాన్ని ఎదుర్కొనుటలో అతనికతడే సాటి. అతనివల్ల సహాయమందుకున్న వారే అతనికి ద్రోహం చేశారని. ఆయన సమకాలికులు అతనిని సరిగా గౌరవించలేకపోయారని. ఎవరెన్ని విధాల వంచించినా ప్రజలను నమ్మి తన సర్వస్వాన్ని ధారపోసిన త్యాగమూర్తి ప్రకాశం.అని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పి స్వరూపరెడ్డి పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ప్రజలే ప్రకాశం, ప్రకాశమే ప్రజలు అన్నమాటలో అతిశయోక్తి లేదు. ప్రకాశం తండ్రి గోపాలకృష్ణయ్య, తల్లి సుబ్బమ్మ. వీరి సంతానంగా .1872 ఆగస్ట్ 23న ప్రకాశం జన్మించారు. వల్లూరులో ప్రకాశం ప్రాథమిక విద్య సాగింది. నాటకాల వ్యాపకం వల్ల, ప్రకాశానికి మెట్రిక్ పాస్ అవడం కష్టమయ్యింది. మిషను పాఠశాల ఉపాధ్యాయుడైన ఇమ్మానేని హనుమంతరావు నాయుడు చలవతో ప్రకాశం ఫీజు లేకుండా ప్రీ మెట్రిక్ లో చదివారు.నాయుడు రాజమండ్రికి నివాసం మారుస్తూ, ప్రకాశాన్ని తనతో తీసుకువెళ్ళి, అక్కడ ఎఫ్.ఏ.లో చేర్పించారు. తరువాత మద్రాసుకు పంపించి, న్యాయశాస్త్రం చదివించారని. ప్రకాశం 1890లో తన అక్క కూతురైన హనుమాయమ్మను పెళ్ళి చేసుకున్నారు. ఆ తరువాత కొద్దికాలంపాటు ఒంగోలులో న్యాయవాద వృత్తి చేసి, 1894లో మళ్ళీ రాజమండ్రి చేరారు. వృత్తిలో మంచిపేరు, బాగా డబ్బుని సంపాదించారని. తన 35వ ఏట రాజమండ్రి పురపాలక సంఘానికి అధ్యక్షుడయ్యారని పేర్కొన్నారు. 1907లో బారిష్టర్ వృత్తి లో ప్రవేశించిన ప్రకాశం 1921 దాకా ఆ వృత్తినికొనసాగించారు. పెద్దపెద్ద జడ్జీల ఎదుట కూడా ధైర్యంగా వాదించడం లో ప్రకాశం వాదనా పటిమ అపూర్వం. భయమనే మాట ఆయన జీవితనిఘంటువులోనే లేదు. న్యాయవాదిగా క్షణం తీరిక లేకుండా గడిపే ప్రకాశం గారి దృష్టి స్వాతంత్ర్య సంగ్రామం వైపు మరలిందన్నారు. మహాత్మా గాంధీ పిలుపుతో ప్రకాశం న్యాయవాద వృత్తికి స్వస్తి పలికి స్వాతంత్ర్య సంగ్రామంలోకి వెళ్లారు. ఇది ఆయన జీవితాన్ని కీలక మలుపు తిప్పింది. ప్రకాశం స్వరాజ్య పత్రిక తో పాటు పలు పత్రికలను నిర్వహించారు. ప్రధానంగా స్వరాజ్య పత్రిక కోసం ప్రకాశం తన ఆస్తులను వెచ్చించ వలసి వచ్చింది. తాను నమ్మిన సిద్ధాంతం కోసం ఆనాటి జాతీయ నాయకులతో ఆయన విభేదించారని. ప్రకాశం ధైర్యసాహసాలకు మచ్చుతునక అనదగిన సంఘటన సైమన్ కమిషన్ రాక సందర్భంగా చోటు చేసుకుందని.మద్రాసులో ఒక యువకుడు త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేసేందుకు ప్రయత్నించగా పోలీసులు ఆ యువకుడిని కాల్చి చంపారు. ఆ యువకుడి శవాన్ని తీసుకు వచ్చేందుకు ఎవరికీ ధైర్యం చాలలేదు. విషయం తెలుసుకున్న ప్రకాశం అక్కడకు చేరుకొని మృతదేహం వద్దకు వెళ్ల బోగా పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. ముందుకు అడుగు వేస్తే కాల్చి చంపుతామంటూ వారు హెచ్చరించారని. ఒక పోలీసు ప్రకాశం గుండెలకు తన తుపాకీని గురిపెట్టాడు. అయినప్పటికీ ప్రకాశం వెనుకడుగు వేయకుండా దమ్ముంటే కాల్చండంటూ తన ఛాతీ చూపించడంతో ఆ పోలీసు భయపడి ఊరుకున్నాడని. ప్రకాశం ప్రదర్శించిన ధైర్య సాహసాలను అక్కడి ప్రజలు కొనియాడి. ఆంధ్ర కేసరిగా ఆయనను కీర్తించారన్నారు. ఉప్పు సత్యాగ్రహంలో కూడా ఆయనపాల్గొన్నారని.అమరజీవిపొట్టి శ్రీరాములు ఆత్మార్పణతో 1953 అక్టోబర్ 1వ తేదీన ఆంధ్రరాష్ట్రం ?అవతరించిందని. ఆంధ్రనాయకుడైన ప్రకాశం ముఖ్యమంత్రిగా కర్నూలు రాజధానిగా ఆంధ్ర ప్రజల కోర్కె ఫలించిందన్నారు. ప్రకాశంగారు గుంటూరులో హైకోర్టు, తిరుపతిలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నెలకొల్పారని. కేంద్రప్రభుత్వం మంజూరు కోసం వేచివుండక కృష్ణాబ్యారేజీ నిర్మింపచేశారన్నారు. కాని ఏడాదిలోపే ఆయనపై అవిశ్వాసతీర్మానం పెట్టారు. పదవి పోయినా ప్రజలాయనను అమితంగా గౌరవించారని పేర్కొన్నారు ఆయన ఆత్మకథ "నా జీవిత యాత్ర"పేరిట నాలుగు భాగాల పుస్తకంగా విడుదల అయిందని. ఇందులో మూడు భాగాలను ఆయన వ్రాయగా, నాలుగో భాగం మాత్రం తెన్నేటి విశ్వనాథం వ్రాసారన్నారు. దీనిలో స్వాతంత్ర్యోద్యమ నాయకుల మనస్తత్వాలు, అప్పటి ప్రజల స్థితిగతులు వివరించబడ్డాయన్నారు. తెలుగు సమితి హైదరాబాదు ఆగష్టు 2006లో ప్రచురించిందని. ఈ పుస్తకం హిందీ లోకి కూడా అనువదింపబడిందన్నారు. 1957 మే నెలలో ప్రకాశం పంతులు వేసవి కాలంలో ఒంగోలు ప్రాంతంలో పర్యటించి తీవ్రమైన వడదెబ్బకు గురయ్యారు. ఆయనను హైదరాబాదులోని ఉస్మానియా ఆసుపత్రికి చేర్చి 18 రోజుల పాటు చికిత్స అందించినా ఫలితం లేకపోయిందన్నారు. 1957 మే 20న ప్రకాశం పంతులు దివంగతులయ్యారు. ప్రకాశం పంతులు శతజయంతి ఉత్సవాలనుపురస్కరించుకొని 1972 మే 12న. ఒంగోలు జిల్లా పేరును ప్రకాశం జిల్లాగా మార్పు చేశారని. ప్రకాశం పంతులు కాంస్య విగ్రహాన్ని ఒంగోలులో ఏర్పాటు చేశారన్నారు. జిల్లా పరిపాలనా భవనానికి ప్రకాశం భవనం అనే పేరు పెట్టారు. ఆయన జయంతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తుంది. నేటితరం రాజకీయ నాయకులు టంగుటూరి ప్రకాశం పంతులులోని దేశభక్తిని, త్యాగనిరతిని ప్రజా సంక్షేమ దృష్టిని ఆదర్శంగా తీసుకుని తాము కూడా ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా కృషి చేయాలని ఆశిద్దాం అన్నారు.

# రాష్ట్రఅధికార భాషా సంఘానికి మండలి వెంకట కృష్ణారావు పేరు

## - హర్షం వ్యక్తంచేసిన సాహితీ సంస్థలు



**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ ఆగస్టు 23**

1973లో జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వం ప్రధాన పరిపాలనా శాఖలో ఒక ప్రత్యేకాధికారిని నియమించి అధికార భాషగా తెలుగు అమలు కోసం ఒక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఆ అధికార భాషా శాఖను అప్పటి విద్యా మంత్రి మండలి వెంకట కృష్ణారావుకు అప్పగించింది. వారు ఆ శాఖకు చేసిన సేవకు, తెలుగు భాషకు చేసిన సేవకు గుర్తింపుగా నేడు మన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వముజరాష్ట్ర అధికార భాషా సంఘానికి మండలి వెంకట కృష్ణారావు పేరు నిర్ణయించినందుకు ఆంధ్ర రాష్ట్ర ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర అధికార భాషా సంఘానికి మండలి వెంకట కృష్ణారావు పేరు నిర్ణయించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్,రాష్ట్ర మంత్రివర్గానికి ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు కళామిత్రమండలి తెలుగు లోగిలి సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలి వెంకటకృష్ణారావు తెలుగు అధికార భాషా సంఘం గా ప్రకటించడం పట్లచాలా సంతోషంగా ఉందని నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ, నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డా.నాగభైరవ ఆదినారాయణ, శ్రీకృష్ణదేవరాయ సంస్థ అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు,మిడసల మల్లికార్జునరావు, ప్రముఖ కవి యు.వి.రత్నం, ఓరుగంటి ప్రసాద్,కె.బాలకోటయ్య,బీరం అరుణ,నెమ్మాని సీతారామ మూర్తి,గుంటూరు సత్యనారాయణ, తన్నీరు బాలాజీ తదితరులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మాజీ సైనికుడు గొర్రె వెంకటేశ్వర్లు మృతి

## ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మాజీ సైనికుడు గొర్రె వెంకటేశ్వర్లు.

## హైదరాబాదు కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందిన వెంకటేశ్వర్లు

**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 23**

కొమరోలు మండలం అల్లినగరం గ్రామానికి వెలుపల గల హైస్కూలు ఎదురుగా ఈనెల 17వ తేదీ జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మాజీ సైనికుడు గొర్రె వెంకటేశ్వర్లు (69) హైదరాబాదులోని కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారని కొమరోలు ఎస్సై నాగరాజు తెలిపారు. బేస్తవారిపేట మండలం సోమవారిపల్లె గ్రామానికి చెందిన మాజీ సైనికుడు గొర్రె వెంకటేశ్వర్లు హైదరాబాదులో నివాసం ఉంటున్నారు. వైయస్సార్ కడప జిల్లా అక్కపల్లె లో జరుగుతున్న తమ సమీప బంధువుల వివాహ మహోత్సవానికి హాజరయ్యేందుకు వెంకటేశ్వర్లు ఈనెల 17వ తేదీ ఉదయం గిద్దలూరు కు వచ్చారు. అక్కడ తన బావమరిది వీరయ్య తో కలసి ద్విచక్ర వాహనంపై వైయస్సార్ కడప జిల్లా అక్క పల్లి గ్రామానికి వెళుతుండగా, అల్లినగరం గ్రామం వెలుపలగల హై స్కూల్ ఎదురుగా ఆకస్మిక గేదెలు అడ్డు రావడంతో మోటార్ బైక్ అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. ఆ ప్రమాదంలో వీరయ్య చేతులు ,కాళ్లకు ,ముఖ భాగానికి రక్త గాయాలు కాగా వెనక కూర్చున్న మాజీ సైనికుడు వెంకటేశ్వర్లు తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. దీనితో ఆయనను గిద్దలూరులో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం ఆయన బంధువులు హైదరాబాదులోని కేర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం వెంకటేశ్వర్లు మృతి చెందాడని కొమరోలు ఎస్సై నాగరాజు తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఆయన తెలిపారు.



# తెలుగువారి ఆత్మస్థైర్యానికి నిలువుటద్దం ప్రకాశం పంతులు

*ప్రకాశం 153వ జయంతి సందర్భంగా*

*నివాళులు అర్పించిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డి*

*స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల*






**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 23**

ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత "స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం జోరుగా కొనసాగుతోందని. ప్రతి నెల 3వ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని. స్వర్ణాంధ్ర 2047 సంకల్పంలో భాగంగా గిద్దలూరు పట్టణ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు.. మొదటగా మున్సిపల్ కార్యాలయంలో ఉమ్మడి ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ప్రకాశం పంతులు 153వ జయంతి సందర్బంగా వారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా అశోక్ రెడ్డి మాట్లాడుతూ తెలుగువారి ఆత్మస్థైర్యానికి నిలువుటద్దంలా నిలిచిన నాయకుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని, దేశ స్వాతంత్ర్యం కోసం సమస్తమూ త్యాగం చేసిన దేశ భక్తుడని, స్వాతంత్ర్యం అనంతరం పదవిలో ఉన్నా లేకున్నా ప్రజా సంక్షేమమే ఊపిరిగా బతికిన అసలైన ప్రజా నాయకుడు, ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆ రోజుల్లోనే 14 నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రారంభించిన రైతు బాంధవుడు ప్రకాశం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మున్సిపల్ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, కమిషనర్ ఈవి రమణబాబు, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, పట్టణ అధ్యక్షులు సయ్యద్ శానేశావలి, పట్టణ కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో ప్రజలు భాగస్వాములు కావాలి - రాష్ట్ర మంత్రి డా. డోలా





**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ ఆగష్టు 23**

స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. శనివారం ఉదయం ఒంగోలు కలెక్టరేట్ లో నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, శాసన మండలి సభ్యులు భూమిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి, సంతనూతలపాడు శాసన సభ్యులు బి.ఎన్. విజయకుమార్, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఎపి మాల వెల్ఫేర్ కార్పోరేషన్ చైర్మన్ డా విజయకుమార్, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ లతో కలిసి మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేసారు. ఈ సందర్భంగా మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ, వ్యక్తి గత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గత డిసెంబర్ మాసం నుండి ప్రతి నెలా మూడవ శనివారం ఒక్కొక్క నెల ఒక్కొక్క థీమ్ తో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 3వ శనివారం కృష్ణాష్టమి పండుగ రావడంతో 4వ శనివారం ఈ రోజు స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరుగుచున్నదన్నారు. హాండ్స్ క్లీనింగ్, డ్రైన్ క్లీనింగ్ ప్రధానాంశంగా ఈ రోజు స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా డ్రైన్స్ క్లీనింగ్ చేయడం, దోమల నివారణకు మందులు స్ప్రే చేయడం, నీటి నాణ్యతలను పరీక్షించడం, హాండ్ వాష్ పై అవగాహన కలిగించడం తదితర కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. గత మాసంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నివారించే అంశంతో కార్యక్రమాన్ని జరుపుకోవడం జరిగిందన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో డ్రాయింగ్ ఆఫీసర్ ను యూనిట్ గా తీసుకొని ఒక నిబద్ధతతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. సమాజంలో పరిసరాలు పరిశుభ్రతతో ప్రశాంత జీవనం సాగిస్తున్నామంటే పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమన్నారు. పారిశుధ్య కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ద తీసుకోవడం జరుగుచున్నదని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఆర్డిఒ లక్ష్మి ప్రసన్న, ఒంగోలు మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. వెంకటేశ్వర రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షునిగా కూటాగుళ్ళ మహబూబ్ బాషా



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 23**

కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండల టిడిపి అధ్యక్షుడు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సంస్థాగత ఎన్నికలలో భాగంగా మండల టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షునిగా కూటాగుళ్ళ మహబూబ్ బాషా ను ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అలాగే మండలానికి చెందిన పలువురికి మైనార్టీ సెల్ కార్యవర్గంలో చోటు లభించింది. ఈ సందర్భంగా మండలం టిడిపి అధ్యక్షులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు మైనార్టీ సెల్ కమిటీ ప్రకటించారు. కూటాగుళ్ల మహబూబ్ బాషా అధ్యక్షునిగా ఎన్నిక కాగా ఉపాధ్యక్షులుగా షేక్ బాషా, షేక్ అబ్దుల్, మండల ప్రధాన కార్యదర్శిగా షేక్ నాయబ్ రసూల్, కార్యదర్శులుగా షేక్ ఖలీం, షేక్ మన్సూర్, షేక్ ఖలీల్, షేక్ నాగర్ వలి, షేక్ అక్బర్, షేక్ రఫీ లను నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన మహబూబ్ బాషా మాట్లాడుతూ నాకు సహకరించిన కనిగిరి శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కి మరియు మండల టిడిపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో టిడిపి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

## మాలకొండ ఆదాయం రూ. 6,95,813




**వలేటివారిపాలెం పెన్ పవర్ ఆగష్టు 23**

అయ్యవారి పల్లి పంచాయతీ పరిధిలోని మాలకొండ లో వెలిసియున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారికి శనివారం భక్తుల నుండి వివిధ రూపాల ద్వారా రూ. 6,95,813 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ చంద్రశేఖర్ తెలిపారు తెలిపారు. ఆలయ అర్చకులు గౌరి శంకర్, నృసింహ చార్యులు స్వామివారిని అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు .

## అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు డిమాండ్**



**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ ఆగష్టు 23**

అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, వారి సమస్యలను పరిష్కరించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒంగోలులోని అంబేద్కర్ భవనంలో శనివారం అగ్రి గోల్డ్ బాధితుల రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ముప్పాళ్ళ నాగేశ్వరరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తమ మేనిఫెస్టోలో పొందుపరిచారని అన్నారు. చంద్రబాబు నాయుడు మాటలు నమ్మి రాష్ట్రంలోని అగ్రిగోల్డ్ బాధితులు కూటమికి ఓటు వేసి గెలిపించుకున్నారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటిన అగ్రిగోల్డ్ బాధితుల సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడ అన్న చందంగా మారిందన్నారు. ఒక సమస్య కూడా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. అగ్రిగోల్డ్ కంపెనీ పని చేస్తున్న సమయంలో రియల్ ఎస్టేట్ ప్లాట్ లను, ఫామ్ ప్లాట్లను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్న బాధితుల భూములను ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ అటాచ్మెంట్ నుంచి తొలగించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం డెడికేటెడ్ సిఐడి టీమును ఏర్పాటు చేసి, వారిని ఎటువంటి ట్రాన్స్ఫర్లు చేయకుండా సమస్యలు వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. అగ్రిగోల్డ్ ఆస్తులను ఆర్డర్ సంస్థ ద్వారా విలువలు లెక్కించారని కోరారు. అలాగే అగ్రిగోల్డ్ భూములను వేలం ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వివి నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి తిరుపతిరావు, ప్రకాశం జిల్లా గౌరవ అధ్యక్షులు వి హనుమారెడ్డి, డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, రాష్ట్రం నలుమూలల నుండి విచ్చేసిన అగ్రిగోల్డ్ బాధితుల నాయకులు ఆరేళ్లమ్మ, మాణిక్యాలరావు, శేష కుమార్ రెడ్డి, రాంబాబు, నాగలక్ష్మి, జగన్, మంత్రి నాయక్, సుబ్బారావు, రామదాసు, శంకరయ్య, బెల్లంకొండ శ్రీనివాస్, ముని శంకర్, ఖాదర్ భాషా, మల్లికార్జున, భద్రం, కుమార్, బుడిత అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అత్తింటివారిపాలెం అంగన్వాడీ సెంటర్లో స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర



**వలేటివారిపాలెం పెన్ పవర్ ఆగష్టు 23**

మండలం లోని అత్తింటివారిపాలెం అంగన్వాడీ సెంటర్లో సీడీపీఓ మాధవిలత సూచనల మేరకు సూపర్వైజర్ సునీత అధ్యక్షతన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాన్సున్ హైజిన్ క్యాంపెయిన్ నిర్వహించి వర్షాకాలంలో హైజిన్ మరియు శానిటేషన్ కార్యక్రమం పై అవగాహన కల్పించారు . అంగన్వాడీ సెంటర్లో బాలింతలు మరియు గర్భిణులకు హ్యాండ్ వాష్ వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసి స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం లోసూపర్ వై జర్ సునీత , పంచాయతీ కార్యదర్శి నాగ దుర్గ, ఏఎన్ఎం రత్న కుమారి, మిడ్ లెవెల్ హెల్త్ ప్రోవైడర్ మధుష, ఆశ, అంగన్వాడీ సిబ్బంది భారతి, లక్ష్మీ గ్రామస్థులు పాల్గొన్నారు.

## జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులుగా నాగరాజు



**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 23**

జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులుగా బండారు నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శనివారం నాడు రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులు తన్నీరు సుబ్బారావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. పొదిలి ప్రాంతానికి చెందిన నాగరాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న వడ్డెర కులస్తులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షలకు పైగా జనాభా కలిగిన తమ సామాజిక వర్గాన్ని అన్ని విధాల గుర్తించాలని నాగరాజు కోరారు. జిల్లా వ్యాప్తంగా తాను త్వరలో పర్యటిస్తానని, అలాగే వడ్డెర కులస్తుల్లో సామాజిక చైతన్యం తీసుకుని వచ్చేందుకు తాను గట్టి కృషి చేస్తానని నాగరాజు చెప్పారు.

## త్వరితగతిన భూసేకరణపై రైతులతో సమావేశం ఏర్పాటు చేసిన అధికారులు





**గుడ్లూరు, పెన్ పవర్, ఆగస్టు 23:**

పోర్టు ఆధారిత పరిశ్రమల స్థాపనకొసం భూసేకరణపై రైతులతో సమావేశం మండలంలోని రావూరు గ్రామ సచివాలయంలో శనివారం అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ మరియు ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లు పాల్గొని భూసేకరణపై స్థానిక రైతులతో చర్చించారు. తొలుత స్థానిక తహశీల్దార్ విజయ్ భాస్కర్ ముఖ్య అతిథులకు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. భూసేకరణ విషయమై గ్రామ ప్రజలు రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లాస్థాయి అధికారులు మాట్లాడుతూ నోటిఫికేషన్ నందు పబ్లిష్ చేసిన భూములను రైతులు త్వరగా ప్రభుత్వం వారికి ఇవ్వడానికి ముందుకు రావాలని కోరారు. త్వరగా రైతులు తమ భూములను ప్రభుత్వానికి అప్పగించినట్లయితే పరిశ్రమ ఏర్పాటుతో తమ ప్రాంత అభివృద్ధి జరిగి, నిరుద్యోగ యువకులకు త్వరగా ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, ప్రజలు అడిగిన సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికార, సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ప్రజలు మాట్లాడుతూ ఇళ్ళు మరియు ఇళ్ల స్థలాలు కూడా తీసుకొని ఆర్ అండ్ ఆర్ కాలనీ ఏర్పాటు చేసిన యెడల, ప్రభుత్వం వారికి సాగు భూములు ఇవ్వడానికి అభ్యంతరం లేదని వారు అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు మారిటైమ్ బోర్డు అధికారులు, స్థానిక తహశీల్దార్ విజయ్ భాస్కర్, రెవిన్యూ అధికారులు, సెక్రటరీ, సచివాలయ సిబ్బంది, గ్రామ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి

**న్యాయమూర్తి భరత్ చంద్ర**



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 23**

గిద్దలూరు లో సెప్టెంబర్ 13వ తేదీన జరిగే లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని గిద్దలూరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ భరత్ చంద్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు పరిష్కరించుకునేందుకు ఇదే సరైన వేదిక , మార్గమని అన్నారు. లోక్ అదాలత్ లో పరిష్కరించబడ్డ కేసులకు ఎటువంటి అప్పీల్ ఉండదని ఇదే అంతిమ తీర్పు అని న్యాయమూర్తి భరత్ చంద్ర అన్నారు. కక్షిదారులు కట్టిన రుసుము కూడా వెనక్కి ఇప్పించబడునని న్యాయమూర్తి తెలిపారు. సెప్టెంబర్ 13వ తేదీన జరిగే లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని భరత్ చంద్ర కక్షి దారులకు విజ్ఞప్తి చేశారు.

## ముండ్లపాడు లోని ఎస్సి వసతి గృహాన్ని తనిఖీ చేసిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఓంకార్

### వసతి గృహం నిర్వహనపట్ల అసంతృప్తి వ్యక్తం

**గిద్దలూరు పెన్ పవర్ ఆగష్టు 23**

ముండ్లపాడు లోని గంజి వీరభద్రయ్య జడ్పీ హైస్కూల్ ఆవరణలోని ఎస్సీ వెల్ఫేర్ హాస్టలను ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ భవనము మరమ్మత్తులు పూర్తి కాకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే చర్యలు చేపట్టి పూర్తిస్థాయి హాస్టల్ భవనం త్వరలో అందుబాటులోనికి తీసుకురావాలని ఆదేశించారు. విద్యార్థులకు సరైన వసతి భద్రత కల్పించవలసిన బాధ్యత అధికారులపై ఉందన్నారు . భోజన వసతి, సౌకర్యముల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు .క్రమశిక్షణతో చదువుకోవాలని విద్యార్థులకు హితబోధ చేశారు. ఏమైనా సమస్యలు ఉన్నచో గిద్దలూరు మండల న్యాయ సేవాధికారి సంస్థ దృష్టికి గాని లేక అర్జీ రూపంలో కలెక్టర్ కు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 120 మంది హాస్టల్ విద్యార్థులు, ఇన్చార్జి వార్డెన్ ఆంజనేయులు,ఇద్దరు వాచ్మెన్లు పాల్గొన్నారు.



# వినాయక మండపం ఏర్పాటుకు గణేష్‌ఉత్సవ్ నెట్‌లో దరఖాస్తు చేసుకోవాలి

### ఎస్సై వి.వెంకట్రావు -అనుమతులు లేకుండా మండపాలు పెడితే కఠిన చర్యలు.


### నియమ, నిబంధనలు సూచించిన ఎస్సై.

### అనుమతులకు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదు.

**గుడ్లూరు, పెన్ పవర్, ఆగస్టు 23:**


వినాయకచవితి పండుగ పర్వదినం సందర్భంగా వినాయక మంటపాలు ఏర్పాటుచేయు ప్రజల కోసం పోలీస్ శాఖ ప్రత్యేకంగా సింగిల్ విండో సిస్టం ద్వారా గణేష్ ఉత్సవాలకు అనుమతులను పొందే విధంగా గణేష్ఉత్సవ్.నెట్ అనే వెబ్సైట్ ను ప్రారంభించి ఉన్నదని, మండపాలు ఏర్పాటు చేయదలచిన వారు ఆ సైటు కు వెళ్లి కింద తెలిపిన వివరాలను నమోదు చేసుకోవాలని స్థానిక ఎస్సై వి.వెంకట్రావు శనివారం తెలిపారు. ఈ వెబ్సైట్ నందు గణేష్ మంటపం ఏర్పాటు చేయదలచిన కమిటి సభ్యుల వివరాలు, మంటపం ఏర్పాటు చేయు ప్రదేశం, ఏ పోలీసు స్టేషన్ పరిధిలోకి వస్తుంది, విగ్రహం ఎత్తు, మంటపం ఎత్తు, విగ్రహ ప్రతిష్ఠ ఏ రోజు జరుగుతుంది, నిమజ్జనం ఎక్కడ ఏ సమయంలో చేస్తారు, ఏ వాహనం ద్వారా నిమజ్జనం చేస్తారు వంటి వివరాలను నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అనుమతులు పొందడానికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఆన్ లైన్ లో దరఖాస్తు సంబంధిత పోలీసు స్టేషన్ ఎస్.హెచ్.ఓ సమర్పించ బడుతుందన్నారు. అనంతరం ఎస్.హెచ్.ఓ తనిఖీచేసి ఏర్పాటు సురక్షితంగా మరియు నిబంధనలకు అనుగుణంగా ఉన్నట్లుగా తేలితే, క్యూఆర్ కోడ్ కలిగిన నిరభ్యంతర పత్రాన్ని జారీ చేస్తామన్నారు. ఈ అనుమతి పత్రాన్ని ప్రింట్ చేసి గణేష్ మంటపంలో తప్పనిసరిగా ఉంచాలన్నారు. వినాయక ఉత్సవాలను శాంతియుతంగా, భద్రతా పరమైన నియమ నిబంధనలు పాటిస్తూ జరుపుకోవాలని, పబ్లిక్ ప్రదేశాలలో అనుమతి లేకుండా వినాయక మండపాలు/పందిళ్లు ఏర్పాటు చేయవద్దని, సింగిల్ విండో విధానం ద్వారా సులభంగా అనుమతులు పొందాలని జిల్లా ఎస్పీ ప్రజలకు తెలిపారన్నారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణేశులను మాత్రమే ప్రతిష్ఠించాలి. వినాయక చవితి వేడుకల సందర్భంగా పాటించాల్సిన నియమ నిబంధనలు మరియు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలు ఎస్సై తెలిపారు. గణేష్ విగ్రహ ప్రతిష్ఠ, పందిళ్ళు/మండపాలు ఏర్పాటు చేసుకోవడానికి ముందస్తుగా ఒక కమిటీని ఏర్పాటుచేసి, ఆ కమిటీదే అన్ని బాధ్యతలని స్పష్టంగా గుర్తించాలన్నారు. పంచాయతీ/మున్సిపాలిటీ/ నగర పాలక సంస్థ లేదా ప్రయివేట్ స్థలాలలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు




చేయాలనుకుంటే సంబంధిత స్థలయజమాని లేదా సంబంధిత విభాగపు అధికారుల అనుమతి తప్పనిసరిగా పొందాలన్నారు. ఫైర్, విద్యుత్ శాఖల విభాగాలు సూచించిన నియమ నిబంధనలకు అనుగుణంగా పందిళ్ళు/మంటపాలు వద్ద అగ్ని ప్రమాదాలు తలెత్తకుండా నివారించడానికి మంటపంలో తగినంత ఇసుక, నీళ్ళ మరియు ఫైర్ వంటి అగ్ని మాపక పరికరాలు ఉండాలన్నారు. పందిళ్లు లేదా మండపాలలో అగ్నిప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యుత్ వైర్లు మరియు ప్రకాశవంతమైన లైట్ల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా, వైరింగ్ను నిపుణుల ద్వారా సురక్షితంగా చేయించుకోవాలన్నారు. వినాయక చవితి మండపాల వద్ద అధిక శబ్ద కాలుష్యాన్ని కలిగించే స్పీకర్లు వినియోగించకూడదన్నాటు. స్పీకర్లు ఉదయం 6:00 గంటల నుంచి రాత్రి 10:00 గంటల వరకే వినియోగించాలన్నారు. మైకులో ఎవరైనా కించపరిచే విధంగా వ్యాక్యలు చేయటం గాని, రెచ్చగొట్టి ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ప్రచారం చేయరాదన్నారు. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, దేవాలయాలు/చర్చిలు/మసీదులు (ప్రత్యేక స్థలాల వద్ద) పోలీస్ స్టేషన్లు లేదా ఇతర ప్రభుత్వ కార్యాలయాల వద్ద మైక్ ద్వారా ఎటువంటి ప్రచారమూ చేయరాదన్నారు. రాత్రి వేళలలో మండపాల వద్ద నిర్వహణ కమిటీ ప్రతినిధులు విధిగా కాపలా ఉండి, భద్రతా దృష్టితో, ప్రతి మండపం తమకు తగిన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. రాత్రి సమయాలలో పందిళ్లు/మంటపాలలో విలువైన వస్తువులు ఉంచకూడదన్నారు. ఉత్సవాలు జరుగుతున్న ప్రదేశంలో కమిటీ సభ్యులు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని, భద్రతా పరిరక్షణ కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పందిళ్ల వద్ద మరియు ఊరేగింపు సమయంలో అనుచిత ప్రదర్శనలు, అసభ్య నృత్యాలు జరగకుండా ఉండే విధంగా ఉత్సవ నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఊరేగింపు సమయంలో పోలీసుల అనుమతి లేకుండా వేషధారణలు, ఎక్కువ శబ్ధము వచ్చే వాయిద్యాలు అనగా డి.జే. వంటి తదితరాలకు అనుమతి ఉండదని అన్నారు. నిమజ్జన ఊరేగింపుకు అనుమతించిన సమయం, నిమజ్జనకు కేటాయించిన ప్రదేశం, అలాగే ఊరేగింపుకు కేటాయించిన మార్గాలలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, ఊరేగింపు సమయంలో ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా, రద్దీ తగ్గించేందుకు మరియు భద్రత కోసం తగినంత మంది కమిటీ సభ్యులు, ఉత్సవ నిర్వాహకులు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై వెంకట్రావు తెలియజేశారు.

## శ్రీ నారాయణ స్వామిని దర్శించిన రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 23**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణ స్వామి వారి దేవస్థానం ను దేవాదాయ ధర్మాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ దర్శించుకున్నారు ఈ సందర్భంగా శ్రీ నారాయణస్వామి దేవస్థాన కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు ప్రత్యేక స్వాగతం పలికారు అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించారు దేవస్థానంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల కార్యక్రమాలపై చర్చించి పలు సూచనలు చేశారు తదుపరి భైరవకోనలోని శ్రీ భైరవేశ్వర స్వామి ని దర్శించుకుని పూజలు చేశారు ఈ కార్యక్రమంలో శ్రీ నారాయణ స్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహ బాబు, ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఆత్మ ఆధ్వర్యంలో మినుము పంట ప్రదర్శన క్షేత్రం




**అర్ధవీడు, పెన్ పవర్ , ఆగస్టు 23**

అర్ధవీడు మండలంలోని బోగోలు గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో మినుము పంట ప్రదర్శన క్షేత్రం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి శివగంగ ప్రసాద్ మినుము పంట వేసినటువంటి చెగిరెడ్డి వెంకట నారాయణ రెడ్డి పొలం ను సందర్శించి ప్రస్తుతము మినుము పంట పూత దశలో ఉన్నందున పంటకు తెల్ల దోమ ఆశించే అవకాశం ఉన్నందు వలన ముందు జాగ్రత్తగా ఆసిపేట్ 1.5 గ్రాములు లీటర్ నీటికి లేదా వేప నూనె 500 ఎంఎల్ ఒక ఎకరంనకు కలుపుకొని పిచికారి చేయాలని రైతుకు తెలియజేశారు. దీనివలన మినుము పంటలో పల్లాకు తెగులు సమస్య నుండి బయటపడవచ్చు అని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చెగిరెడ్డి వెంకట్ రెడ్డి మరియు వీఏఏ హస్మత్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

## పంచాయతీ పరిధిలో వీధి దీపాల మరమ్మతులు

### గ్రామ సచివాలయం, వాటర్ ట్యాంకు ఆవరణలో జంగిల్ క్లియరెన్స్

### గ్రామ సర్పంచ్ షేక్ ఖాదర్ బీ బుజ్జి






**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 23**

మండలంలోని కోవిలంపాడు పంచాయతీ పరిధిలో గ్రామ ప్రజల సౌకర్యార్థం సర్పంచ్ షేక్ ఖాదర్ బీ బుజ్జి శనివారం వీధి దీపాల మరమ్మతులు, గ్రామ సచివాలయం, వాటర్ ట్యాంక్ పరిధిలో పిచ్చి చెట్లు, కంప చెట్లు పెరిగి ప్రజల ఇబ్బందులను గుర్తించి జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు రాత్రి వేళల్లో చీకట్లు నివారించి ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రతి వీధిలో పనిచేయని దీపాలను సరి చేసి, బల్బులు మార్పించి కొత్త లైట్లు వేశారు పంచాయతీ పరిధిలో వీధి దీపాలు పూర్తిగా మరమ్మతులు చేపడతామని అన్నారు అలాగే గ్రామ సచివాలయం మరియు వాటర్ ట్యాంక్ పరిధిలో కంప చెట్లు పెరిగి ఇబ్బందులను గుర్తించి జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించారు పలువురు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రతి విద్యార్థి ఒక లక్ష్యంతో ముందుకు సాగాలి

### జడ్జి ఉపాధ్యాయుడిగా మారి బోర్డు పై జవాబులు -ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్








**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 23**

మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో దంతరపల్లి గ్రామంలోని సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, సంజీవరాయునిపేట సచివాలయంలో శనివారం జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ముఖ్యఅతిథిగా గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి , మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ ఏ.ఓంకార్ పలు చట్టాలపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క విద్యార్థి ఒక లక్ష్యం పెట్టుకొని దానికి చేరుకోవటానికి నిరంతరము కృషి చేయాలని, తల్లిదండ్రులకు ,చదువు చెప్పిన అధ్యాపకులకు మంచి పేరు తీసుకురావాలని న్యాయమూర్తి దిశా నిర్దేశం చేశారు. అలాగే బాల్య వివాహముల నిషేధ చట్టం, మోటార్ వాహనముల చట్టం, కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం, సైబర్ నేరములు,జువైనల్ జస్టిస్ బోర్డ్ చట్టం,బాల్య వివాహములు జరుగుతుంటే తెలియజేయడానికి టోల్ ఫ్రీ నెంబర్ వన్ 1098 ,గుడ్ టచ్ బ్యాడ్ గురించి తెలియజేశారు.అలాగే విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు జడ్జి బోర్డ్ మీద రాసి సమాధానాలు తెలియజేసారు.విద్యార్థికి పెన్ను బహుమతిగా ఇచ్చారు.అలాగే జడ్జి సచివాలయంలోని గ్రామప్రజలకు ఎస్సీ.యస్టీ లపై అట్రాసిటీలు జరగకుండా నిరోధక చట్టం గురించి, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ యాక్ట్, ఉచిత న్యాయ సహాయము, పట్టాదారు పాస్ పుస్తకముల గురించి, సివిల్ హక్కులకు సంబంధించిన పలుచట్టముల గురించి తెలియజేశారు .ఈ కార్యక్రమంలో సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ గోసా. సంధ్యారాణి, కరస్పాండెంట్ గోసా.కర్ణ, సంజీవరాయుని పేట సర్పంచ్ బి. ఓబులమ్మ ,పంచాయతీ సెక్రటరీ ,న్యాయవాదులు గోసా.ఆనంద కుమార్, మోడీ .పిచ్చయ్య ,కటారి పోలయ్య ,రైడర్ బాబు ,పారా లీగల్ వాలంటీర్ అద్దంకి. మధుసూధనరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు,సచివాలయ సిబ్బంది,గ్రామస్థులు,పాల్గొన్నారు.

## ఎంబెడెడ్ సిస్టమ్స్ పై అవగాహన సదస్సు ముగింపు

### విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేసిన చైర్మన్ వెన్న హనుమారెడ్డి





**మార్కాపురం ఆర్.సి ఇన్చార్జి పెన్ పవర్ ఆగస్టు 23**

మార్కాపురం మండలం దరిమడుగు గ్రామంలోని ఇందిరా ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబెడెడ్ సిస్టమ్స్ అంశంపై వారం రోజుల శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఇగ్నైట్ ఎంబెడెడ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సదస్సులో విద్యార్థులకు ఎంబెడెడ్ సిస్టమ్స్ ప్రాముఖ్యత, భవిష్యత్తులో దీనివల్ల కలిగే ప్రయోజనాలు, పరిశ్రమలలో, గృహస్థాయిలో వీటి వినియోగం వంటి అంశాలను నిపుణులు విశదీకరించారు. ఈ సందర్భంగా ఆ కంపెనీ సీఈఓ వీరాంజనేయరెడ్డి, సీనియర్ టెక్నికల్ ఎంబెడెడ్ ఇంజనీర్ సాయి శివ శంకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా వి హెచ్ ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వెన్న హనుమారెడ్డి పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న సాంకేతిక పరిణామాల్లో ఎంబెడెడ్ టెక్నాలజీ అనేది ప్రధాన పాత్రధారిగా అవతరిస్తోందన్నారు. విద్యార్థులు ఈ రంగంలో శ్రద్ధ పెడితే భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉంటాయని తెలిపారు. ఇన్నోవేటివ్ ఐడియాలతో ముందుకు వస్తే స్వయం ఉపాధి అవకాశాలు కూడా పొందవచ్చు అని చెప్పారు. తాము ఎల్లప్పుడు విద్యార్థుల నాలెడ్జ్ పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యాలయంలో డైరెక్టర్ శంకర్ బాబు, వివిధ విభాగాల హెచ్ ఓ డీ లు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## మెగా డిఎస్సి ఫలితాల్లో బసవాపురం యువకుడి ప్రతిభ

### జిల్లా స్థాయిలో 4వ ర్యాంక్

**కొనకనమిట్ల పెన్ పవర్ ఆగస్టు 23**



కొనకనమిట్ల మండలం బసవాపురం గ్రామానికి చెందిన బ్రహ్మయ్య అనే యువకుడు శుక్రవారం విడుదలైన మెగా డిఎస్సి 2025 ఫలితాలలో అద్భుతమైన విజయం సాధించారు. ఎస్జిటి (సెకండరీ గ్రేడ్ టీచర్) విభాగంలో 91.3 మార్కులతో జిల్లా స్థాయిలో 4వ ర్యాంక్ సాధించి గ్రామానికి ప్రత్యేక గౌరవాన్ని తెచ్చారు.బ్రహ్మయ్య తన విద్యాభ్యాసం 1 నుండి 10 వరకు ప్రభుత్వ స్కూల్స్ లో పూర్తి చేసారు. తరువాత ఇంటర్ ప్రతిభ కాలేజీలో చదువుతూ ఆ తర్వాత టిటిసి మైనంపాడు ప్రభుత్వ డైట్ కళాశాలలో విద్య కొనసాగించారు.చిన్న గ్రామం నుండి జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచినందుకు తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు బ్రహ్మయ్య విజయంతో సంతోషం వ్యక్తం చేస్తూ అతను భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థానాలను సాధించాలని ఆకాంక్షించారు.

## పెద అలవలపాడులో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం





**పీసీపల్లి పెన్ పవర్ ఆగస్టు 23**

మండలంలోని పెద అలవలపాడు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర , స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం ఎంపీడీఓ హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి నెలా నాలుగో శనివారం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న కాలువలో పూడిక తీయించారు . అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ని విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షపు నీరు నిల్వ ఉండటం వలన వచ్చే వ్యాధులు,తీసుకోవలసిన జాగ్రత్తలు పరిసరాల మరియు వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు . ఈ కార్యక్రమం లో ఇఓఆర్డీ,మండల విద్యా శాఖ అధికారులు, ఆరోగ్య శాఖ సిబ్బంది , ఏపిఓ, పంచాయతీ కార్యదర్శి మరియు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# అర్ధవీడులో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం









**అర్ధవీడు, పెన్ పవర్, ఆగస్టు 23**

మండల కేంద్రమైన అర్ధవీడులోని పంచాయతీ కార్యాలయం నందు, ప్రభుత్వ హాస్టల్ వసతి గృహాల నందు శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి బి ఏడుకొండలు ఆధ్వర్యంలో , మరియు విఆర్ ఓ హజరయ్య లు కలిసి శనివారం ర్యాలీ నిర్వహించారు. హాండ్స్ క్లీనింగ్, డ్రైన్ క్లీనింగ్ ప్రధానాంశంగా ఈ రోజు స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా డ్రైన్స్ క్లీనింగ్ చేయడం, దోమల నివారణకు మందులు స్ప్రే చేయడం, నీటి నాణ్యతలను పరీక్షించడం, హాండ్ వాష్ పై అవగాహన కలిగించడం తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా రోడ్డుపై నిలిచిన మురుగు నీటిని, బురదను పంచాయతీ కార్మికులతో కలిసి స్వయంగా శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపు నిచ్చారు. తద్వారా వ్యాధులు ప్రాబలకుండా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. అనంతరం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్, ఆశా వర్కర్స్, ఎఎన్ ఎం , పంచాయితీ సిబ్బంది , సచివాలయ సిబ్బంది , పంచాయితీ క్లాప్ మిత్రాలు , తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి ప్రాణాలు కాపాడిన మార్కాపురం పోలీసులు

### రూరల్ ఎస్సై అంకమ్మరావును అభినందించిన ఎస్పీ



**మార్కాపురం టౌన్ పెన్ పవర్ ఆగస్టు 23**

మార్కాపురం పట్టణానికి చెందిన తనీర్ సురేంద్ర అనే యువకుడి ప్రాణాలను శనివారం మార్కాపురం పోలీసులు కాపాడారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కుటుంబ సమస్యల కారణంగా ఉదయం సుమారు 10:00 గంటలకు తాను చనిపోతున్నానని చెప్పి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి, రైల్వే ట్రాక్ వైపు వెళ్లాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న తన అక్క వెంటనే మార్కాపురం రూరల్ పోలీస్ స్టేషన్ అధికారులకు సమాచారం తెలిపింది. మార్కాపురం డీఎస్పీ, సీఐ ఆదేశాల మేరకు ఎస్సై అంకమ్మరావు, సిబ్బంది, ఐటీ కోర్ టీం సాయంతో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సురేంద్ర ఉన్న ప్రదేశాన్ని గుర్తించారు. వెంటనే రైల్వే ట్రాక్ వద్దకు చేరుకొని అతని ప్రాణాలను కాపాడడం జరిగింది. ఆ తర్వాత అతనికి కౌన్సిలింగ్ నిర్వహించి, మానసికంగా ధైర్యం చెప్పి కుటుంబ సభ్యులకు అప్పగించారు.వెంటనే స్పందించి సదరు వ్యక్తి యొక్క ప్రాణాలను చాకచక్యంతో కాపాడిన పోలీసులకు అతని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. విధి నిర్వహణలో మంచి పనితీరు కనబర్చిన మార్కాపురం రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై అంకమ్మరావు, వారి సిబ్బంది కానిస్టేబుల్స్ కాశీ రావు, రంగనాయకులు, ఐటి కోర్ సిబ్బందిని ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ ఐపీఎస్ అభినందించారు.

## ఆర్టీసీ పాయింట్ లో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 23**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ,కనిగిరి ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్ సయానా బేగం ఆధ్వర్యంలో శనివారం "స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" ప్రత్యేక కార్యక్రమాన్ని సి ఎస్ పురం ఆర్టీసీ పాయింట్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బస్టాండ్ ప్రాంగణం, బస్సులు మరియు పరిసరాలను శుభ్రపరచడంతో పాటు, ప్రయాణికులకు, ఉద్యోగులకు శుభ్రత మరియు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డిపిటిఓ సత్యనారాయణ మాట్లాడుతూ స్వచ్ఛతే సేవ, పర్యావరణమే భవిష్యత్తు అన్న నినాదంతో ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని స్వర్ణాంధ్ర సాధనలో శుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఉందని అన్నారు. ప్రతి ప్రయాణికుడు ఆర్ టి సి బస్సులను శుభ్రంగా వాడితే,మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించగలమని పేర్కొన్నారు.స్థానిక శాసన సభ్యులు ఉగ్ర నరసింహ రెడ్డి డిపో అభివృద్ధి కి సహకరిస్తామని చెప్పడం జరిగిందని మన బాధ్యత తో డిపో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఉద్యోగులకు సూచనలు చేశారు. స్వర్ణాంధ్ర %--% స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా ప్రజల్లో శుభ్రత, పర్యావరణ పరిరక్షణ పట్ల మరింత అవగాహన పెంపొందించే ప్రయత్నం జరుగుతుందని తెలిపారు.వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు,వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కలిగించారు.ప్రజా రవాణా ఉద్యోగులు చేత శుభ్రతపై స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమం లో డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం,అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, ఎస్ టి ఐ ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మునగపాడులో పొలం బడి కార్యక్రమం




**కొనకనమిట్ల పెన్ పవర్ ఆగస్టు 23**

మండలంలోని మునగపాడు గ్రామంలో వ్యవసాయ అధికారి ప్రకాష్ రావు ఆధ్వర్యంలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ప్రకాశ్‌రావు మాట్లాడుతూ రైతులు పెట్టుబడులు తగ్గించి వ్యవసాయం చేయాలని సూచించారు.విత్తన శుద్ధి ప్రతి రైతు తప్పనిసరిగా చేయాలని దాంతో 30 రోజులపాటు పంటలు తెగుళ్లు మరియు చీడపీడల నుండి రక్షణ పొందుతాయని రైతులకు వివరించి విత్తన శుద్ధి విధానాన్ని రైతుల ముందు ప్రత్యక్షంగా ప్రదర్శించారు.అలాగే రైతులు పురుగు మందుల వాడకాన్ని తగ్గించి ప్రత్యమ్నాయంగా వేపనూనె వాడాలని దీనివల్ల పురుగులు గుడ్లు పెట్టినా అవి చెడిపోయి పంటకు రక్షణ కలుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని మరికొన్ని వారాలపాటు మునగపాడు గ్రామంలో రైతులతో కలిసి నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.ఏవైనా పంటలపై తెగుళు సోకిన,పురుగు పట్టిన వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించి యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతులకు సూచించారు.అనంతరం వ్యవసాయ విస్తరణ అధికారి విక్రమ్ మాట్లాడుతూ ప్రధాన పంట అయిన కందిపంట చుట్టూ రక్షక పంటలు వేసుకోవాలని అలాగే పొలాల్లో కలుపు లేకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వీఏఏ,ఎంపిఈఓ,గ్రామ రైతులు పాల్గొన్నారు.

## స్వర్ణ ఆంధ్రా స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

### అందరి సహకారం తోనే సుందర గిద్దలూరు మున్సిపల్ కమీషనర్ రమణ బాబు





**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 23**



ప్రజల సహకారం తోనే గిద్దలూరు ను సుందరంగా తీర్చిదిద్దుకుందామని మున్సిపల్ కమిషనర్ ఈ వి రమణ బాబు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రతి నెలా మూడవ శనివారం నాడు నిర్వహించే స్వర్ణ ఆంధ్రా స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం ఆగస్టు నెలలో చేపట్టిన వర్షాకాల పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా శనివారం నాడు గిద్దలూరు పురపాలక సంఘం కార్యాలయం నందు శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ప్రజలందరి చేత స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించి, ప్రతి ఒక్కరు స్వచ్ఛతా ప్రమాణాలు పాటించాలని, పరిసరాల పరిశుభ్రత బాధ్యత గా భావించాలని తెలియచేశారు.ఈ వర్షాకాల పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా పట్టణం లోని డి జి ఆర్ ఆసుపత్రి వద్ద ఉన్న చెత్తని,అలాగే శ్రీనివాస థియేటర్ వద్ద ఉన్న మట్టి దిబ్బలను,సగిలేరు బ్రిడ్జి వద్ద ఉన్న చెత్త కుప్పలను తొలగించి డంపింగ్ యార్డ్ కి తరలించారు ఈ సందర్భంగా పురపాలక సంఘం కమీషనర్ ఇ వి రమణ బాబు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు . వర్షాకాలంలో వచ్చే వరదనీరు డ్రైనేజీలో పారి పోయేందుకు వీలుగా ప్లాస్టిక్ వ్యర్థలను డ్రైనేజి ల్లో వేయరాదన్నారు. కొందరు ప్లాస్టిక్ వ్యర్థాలను ఇప్పటికి డ్రైనేజి లో వేస్తున్నారని పేర్కొన్నారు. వర్షపునీరు వాటంతట అవే పారిపోయే విదంగా చూడాలన్నారు. డ్రైనేజీలో చెత్త చెదారం వేయటం వల్ల డ్రైనేజీలో పూడికచేరి రోడ్లపై కి మురికినీరు వస్తుందన్నారు. గృహస్తులు చెత్తను తడి , పొడి చెత్తగా వేరు వేరుగా మీ ముంగిటికి వచ్చే చెత్త సేకరించే కార్మికునికి అంద చేయాలన్నారు. వర్షాకాలంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కోరారు.మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దే కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో బండారు దేవదాస్ మృతి



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 23**

నంద్యాలలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సి ఎస్ పురం గ్రామానికి చెందిన బండారు దేవదాస్ మృతి చెందారు స్థానికుల సమాచారం ప్రకారం మృతుడు దేవదాస్ కన్స్ట్రక్షన్ పనులు నిమిత్తం నంద్యాల వెళ్లారు ప్రతిరోజు బండారు దేవదాస్ ఉదయాన్నే వాకింగ్ చేస్తూ ఉంటారు ఎప్పటిలాగే శనివారం ఉదయం వాకింగ్ చేస్తున్న సమయంలో వేగంగా కారు ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు.ప్రమాదంపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకునే కమిటీలు పోలీసుల నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

### కొమరోలు పోలీస్ స్టేషన్లో నిర్వహించిన సమావేశంలో సూచనలు సలహాలు ఇచ్చి హెచ్చరికలు జారీ చేసిన ఎస్సై నాగరాజు

**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 23**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని బహిరంగ ప్రదేశాలలో విగ్రహాల మండపాలను ఏర్పాటు చేసుకునే కమిటీ సభ్యులు తాము జారీ చేస్తున్న సూచనలు సలహాలు నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కొమరోలు ఎస్సై నాగరాజు పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీ నిర్వహించే వినాయక చవితి పర్వదిన సందర్భంగా కొమరోలు పట్టణంతోపాటు మండలంలోని గ్రామాలలో బహిరంగ ప్రదేశాలలో వినాయక విగ్రహాల మండపాలను ఏర్పాటు చేసుకోదలచిన కమిటీ సభ్యులతో శనివారం కొమరోలు పోలీస్ స్టేషన్ లో సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంగా ఎస్సై నాగరాజు మాట్లాడుతూ విగ్రహం ఏర్పాటుకు ముందస్తుగా ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని పోలీసుల అనుమతి లభించిన తర్వాతనే విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని ఆయన తెలిపారు .అంతేకాక విద్యుత్తు, ఫైర్ స్టేషన్ అధికారుల అనుమతులు కూడా తప్పనిసరిగా తీసుకోవాలన్నారు .అలాగే మైక్ పెర్మిషన్ కూడా పోలీసుల నుంచి తీసుకోవాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. రోడ్ల అంచుల్లో విగ్రహాలు ఏర్పాటు చేసుకునేవారు ప్రజల రాకపోకలకు ఎలాంటి అవరోధం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరమత సహనాన్ని పాటిస్తూ ,మతపరమైన అవరోధాలు వివాదాలు జరగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు .మండపాలలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని, రాత్రి వేళల్లో కమిటీ సభ్యులలో ఒకరు మండపాలలో కాపలాగా ఉండాలని తెలిపారు. ఎలాంటి అల్లర్లు, గొడవలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. అంతేగాక మండపాలు ఏర్పాటు చేసిన రోజు నుంచి నిమజ్జనం జరిగేంత వరకు మండపాలలో డీజేలు ఏర్పాటు చేయరాదని, ముఖ్యంగా నిమజ్జనం రోజున ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అల్లర్లు, గొడవలు, వివాదాలకు అవకాశం లేకుండా నిమజ్జన కార్యక్రమాన్ని సంతోషంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. నిమజ్జన సమయంలో మద్యం సేవించి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనడం దైవ కార్యాలకు మంచిది కాదని హితువు పలికారు . మద్యం సేవించి అతిగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ఆచరించారు. వినాయక చవితి పర్వదిన సందర్భంగా రాజకీయ రంగు పులిమి వివాదాలు సృష్టించినా, శాంతిభద్రత విఘాతం కలిగించినా, పోలీసు వారి సూచనలు సలహాలు నియమ నిబంధనలు ఉల్లంఘించినా, అలాంటి వారిపై క్రిమినల్ కేసులు బనాయించి కఠిన శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. తాము తమ సిబ్బందితో కార్యక్రమాలను పరిరక్షిస్తూ ఉంటామని ,శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని గుర్తించి కఠినంగా శిక్షించవలసి ఉంటుందని ఆయన మరో మారు హెచ్చరించారు ఆ కార్యక్రమంలో కొమరోలు హెడ్ కానిస్టేబుల్ నారాయణ ,కానిస్టేబుల్ శివరామకృష్ణ ,వీరభద్ర మహిళా పోలీసులు ,హోంగార్డు రాజారావు తో పాటు పలు గ్రామాలను తరలివచ్చిన మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.






## అర్హులైన దివ్యాంగులందరికీ పెన్షన్లు అందించాలి

### జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షులు మధార్ వలి

**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 23**

అర్హులైన దివ్యాంగులందరికీ ప్రభుత్వం పెన్షన్లు అందజేయాలని జిల్లా నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి అధ్యక్షులు ముల్లా మదార్ వలి కోరారు. శనివారం నాడు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వికలాంగుల అత్యవసర సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మ దార్ వలి మాట్లాడుతూ అనర్హుల పేరుతో దివ్యాంగుల పెన్షన్లను తొలగించడం మంచి పద్ధతి కాదన్నారు. సమాజంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ, కాలం వెళ్లదీస్తున్న దివ్యాంగుల పట్ల ప్రభుత్వాలు దయ చూపాలే తప్ప, వారిని అన్యాయం చేయకూడదని ఆయన చెప్పారు. సాకులు చెబుతూ దివ్యాంగుల పెన్షన్లను తొలగిస్తున్న ప్రభుత్వం అర్హత లేకపోయినా సదరం సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్న డాక్టర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మదార్ వలి ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారినా దివ్యాంగుల బతుకులు మాత్రం ఎటువంటి మార్పు రావడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో కూడా ఏవో కుంటి సాకులు చూపిస్తూ సుమారు లక్ష మంది దివ్యాంగుల పెన్షన్లను తొలగించడం జరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే విధానాన్ని అవలంబిస్తుండటం ఆక్షేపనీయమని ఆయన అన్నారు. సమాజంలో దయనీయమైన బతుకులు సాగిస్తున్న దివ్యాంగుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, దివ్యాంగులకు ఎటువంటి నష్టం రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల సంఘం నాయకులు మదార్ వలి కోరారు.



## రాష్ట్ర మహాసభలకు బయలుదేరిన సిపిఐ నాయకులు



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 23**

ఒంగోలులో జరిగే సీపీఐ (భారత కమ్యూనిస్టు పార్టీ) 28 రాష్ట్రాల మహాసభలను జయప్రదం చేయడానికి మండల సీపీఐ కార్యకర్తలను తరలించడానికి సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి ఎస్ కె వై పెద్ద మస్తాన్ ఆధ్వర్యంలో వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. మహాసభలు ప్రారంభం సూచికగా పార్టీ పథకాన్ని ఎగరవేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విజయవంతం కోసం మహాసభ లకు ఒంగోలుకు వెళు తున్నామని అన్నారు రానున్న రోజుల్లో సీపీఐ దేశానికి దిక్సూచిగా మారనుందని, సోషలిస్ట్ సమాజాన్ని ఏర్పాటు చేయడం కోసం రాష్ట్రంలో, దేశంలో సీపీఐ మళ్లీ పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని, దానికి మహాసభలే నిదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఐ నాయకులు కార్యకర్తలు అభిమానులు మహాసభలకు తరలి వెళ్లారు.

## వినాయక చవితి విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

### గణేష్ విగ్రహ మండపాల నిర్వాహకుల కమిటీ సమావేశం -సిఐ భీమా నాయక్





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 23**

వినాయక చవితి పండుగ సందర్భంగా గ్రామాలలో వినాయక స్వామి విగ్రహాలు మండపాలను ఏర్పాటు చేసేందుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సీఐ భీమా నాయక్ అన్నారు. రాష్ట్ర డిజిపి ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ లో శనివారం గణేష్ విగ్రహ మండపాల నిర్వాహకుల కమిటీతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా సామరస్యంతో జరుపుకోవాలని, వినాయక చవితి పండుగ సందర్భంగా గ్రామాలలో వినాయక స్వామి విగ్రహాల మండపాలను ఏర్పాటు చేసేందుకు తప్పనిసరిగా ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలను పాటించాలని తెలిపారు. విగ్రహాలను గ్రామాలలో ఏర్పాటు చేసేందుకు కమిటీ ఏర్పాటు చేసుకోవాలి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా క్రమశిక్షణ పాటించాలని, నిమజ్జనం చేసే తేదీ , నిమజ్జనం చేసే చోటు, ఊరేగింపు చేసే వాహనం వివరాలు పొందపరిచి దరఖాస్తును అందజేయాలని తెలిపారు. కమిటీ ఏర్పాటు చేసిన వారి ఆధార్ కార్డులు ఫోన్ నెంబర్లు జత చేసి అనుమతి పొందాలని సూచించారు. తప్పనిసరిగా విద్యుత్ శాఖ అనుమతి పొందాలని తెలిపారు. నియమ నిబంధనలు విరుద్ధంగా ఎవరైనా అధికమించితే కమిటీ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ భీమా నాయక్ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై వెంకటేశ్వర నాయక్, పోలీస్ సిబ్బంది, వివిధ గ్రామాల విగ్రహ మండపాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కరేడు రైతులకు అండగా ఆమ్ ఆద్మీ రాష్ట్ర నాయకత్వం

## కరేడు సమస్యను ఢిల్లీకి తీసుకెళ్తా -ఆమ్ ఆద్మీ నేత నేతి మహేశ్వర రావు

**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 23**

కరేడు రైతులకు అండగా ఆమ్ ఆద్మీ రాష్ట్ర నాయకత్వం అండగా ఉందని ఆమ్ ఆద్మీ కందుకూరు అసెంబ్లీ కన్వీనర్ నేతి మహేశ్వరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర సర్వసభ్య సమావేశం శనివారం విజయవాడలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి నాయకులు జోనల్ నాయకులు, జిల్లా కన్వీనర్లు, నియోజకవర్గ ఇన్చార్జులు, మహిళా నాయకులు పాల్గొని ఆంధ్రప్రదేశ్లో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యల మీద సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశంలో కందుకూరు నియోజకవర్గం లో జరుగుతున్న పరిణామాల మీద రాష్ట్రస్థాయి నాయకులు అందరూ మాట్లాడారు. కందుకూరులో పార్టీ ఆఫీస్ మీద జరిగిన దాడిని ఖండించడం, అలాగే కందుకూరు అసెంబ్లీ కన్వీనర్ నేతి మహేశ్వర రావు మీద వ్యక్తిగతంగా విమర్శలకు దిగిన అంశాలను ఖండించారు.

రామాయపట్నం బీపీసీఎల్ కరేడు రైతుల కోసం కందుకూరు అసెంబ్లీ కన్వీనర్ నేతి మహేశ్వరరావు పోరాటపటిమను ప్రశంసించడంతోపాటు కందుకూరు ని భయపెడుతున్న మాలకొండ పరిసర ప్రాంతాలు జిందాల్ కంపెనీకి కందుకూరు తూర్పు తీర ప్రాంతం విశ్వేశ్వర్ రెడ్డి లాంటి వాళ్లకు కట్టబెట్టే విధానంలో రైతుల అభిప్రాయాలకు విలువ నివ్వకుండా






2013 భూ సేకరణ చట్టాన్ని తుంగలో తొక్కి వెళ్లే విధానం మీద రాష్ట్రస్థాయి నాయకులు సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర స్థాయి నాయకులందరూ కూడా కందుకూరులో పర్యటించే అంశం మీద సమావేశంలో మాట్లాడడంతో పాటు కరేడు అంశాన్ని ఢిల్లీ స్థాయికి తీసుకువెళ్లి అరవింద్ కేజ్రీవాల్ ని కరేడు ప్రాంతానికి తీసుకొచ్చే అంశం గురించి చర్చించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గంలో అన్ని మున్సిపాలిటీ, జడ్పిటిసి,అన్ని ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికల్లో పార్టీ నిలబడబోతుంది అని అన్నారు. రేపటి కోసం చేయబోయే ప్రజాస్వామ్య యుద్ధంలో కందుకూరు ప్రాంత ప్రజలు భాగస్వామ్యులవ్వాల్సిందిగా పిలుపునిచ్చారు. కార్పొరేట్ల చేతిలో ఉన్న సిండికేట్ రాజకీయ వ్యవస్థ నుంచి ఒక్క ఆమ్ ఆద్మీ పార్టీ నే రైతులకు రైతు కూలీలకు అండగా విజయం సాధించేవరకు నిలబడగలుగుతుంది అని అని సమావేశంలో మహేశ్వరరావు అన్నారు. ఈ సమావేశానికి ఆమ్ ఆద్మీ పార్టీ కందుకూరు మహిళా కన్వీనర్ జడ ఈశ్వరమ్మ, భాస్కరరావు లు పాల్గొన్నారు.

## ఆంధ్రకేసరి ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి

### డాక్టర్ విజయ్ శ్రీనివాస్



**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 23**

ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులుని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ విజయ్ శ్రీనివాస్ అన్నారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి సందర్భంగా కోవూరు రోడ్డు నందు ఉన్న ప్రకాశం పంతులు విగ్రహం వద్ద ఆంధ్ర కేసరి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డాక్టర్ విజయ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ విజయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు పేరును తన తండ్రి గారైన డాక్టర్ కంచర్ల రామయ్య తమ ఇంజనీరింగ్ కళాశాలకు ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలని పేరు పెట్టడం జరిగిందని అన్నారు. ఈ విగ్రహం వద్ద జరిగే ప్రతీ కార్యక్రమానికి తన తండ్రి పాల్గొనేవారిని అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నానని అన్నారు.



ప్రకాశం పంతులు యొక్క ధైర్యాన్ని, సేవా గుణాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కందుకూరిని మరల త్వరలో ప్రకాశం జిల్లాలో కలపాలని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లారని త్వరలోనే అదే జరుగుతుందని, ఇది అందరికీ సంతోషకరమైన విషయం అని అన్నారు. ఇలాంటి గొప్ప వారి ఆదర్శవంతమైన జీవితం నేటి విద్యార్థులకు ప్రతి ఒక్కరూ తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టర్ దామెరా హిమ వంశి, డీఎస్పీ సిహెచ్ వి బాలసుబ్రమణ్యం, పట్టణ టిడిపి అధ్యక్షులు ధామల్లేశ్వరరావు, ఆంధ్ర కేసరి సేవా సమితి ప్రెసిడెంట్ మంచిరాజు మురళీమోహన్, సమితి సభ్యులు, పట్టణ టిడిపి నాయకులు, బిజెపి నాయకులు, ఆంధ్రకేసరి అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం





**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 23**

స్వాతంత్ర్య సమర యోధుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రథమ ముఖ్య మంత్రి స్వర్గీయ ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 154 వ జయంతి కార్యక్రమం శనివారం కోవూరు రోడ్డులో వున్న ప్రకాశం పంతులు కాంశ్య విగ్రహం వద్ద ఉదయం ఆంధ్రకేసరి సేవా సమితి



అధ్యక్షులు మంచిరాజు మురళీ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంనకు విశిష్ట అతిధులు గా కందుకూరు సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ, ముఖ్య అతిధులు గా కందుకూరు డి.ఎస్.పి బాలసుబ్రహ్మణ్యం, అతిధులుగా స్కందపురి బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షులు ఇప్పగుంట వెంకట నాగరాజారావు, తెలుగు దేశంపార్టీ కందుకూరు పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, భారతీయ జనతా పార్టీ కందుకూరు నియోజకవర్గం కన్వీనర్ ఘట్టమనేని హరిబాబు, ఆర్యవైశ్య మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు, ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండంట్ కంచర్ల విజయ శ్రీనివాస్ , పట్టణ ప్రముఖులు, ఆంధ్ర కేసరి అభిమానులు, వివిధ పార్టీ ల నాయకులు పాల్గొనినారు. ఈ కార్యక్రమం ఆంధ్ర కేసరి సేవా సమితి అధ్యక్షులు మంచిరాజు మురళీ, ప్రధాన కార్యదర్శి ఇప్పగుంట వెంకట సుబ్రహ్మణ్యం,సభ్యులు నారాయణం రాధాకృష్ణమాచార్యులు, చలంచర్ల రమణమూర్తి, తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టంగుటూరి ప్రకాశం పంతులు కాంశ్య విగ్రహం ను పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. 154 వ జయంతి సందర్భంగా అన్న క్యాంటిన్ లో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఏర్పాటు చేశారు.

## మండల లెవెల్ అధికారులతో సమన్వయంతో నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలి



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 23**

గిద్దలూరు నియోజక వర్గ శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి నియోజక వర్గ సీవీ ఎపి టీమ్ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా నియోజక వర్గ అభివృద్ధి కోసం పాటు పడాలని, స్వర్ణాంధ్ర -2047 విధి విధానాలు అమలు అయ్యే విధంగా నియోజక వర్గ మండల లెవెల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి కోసం పాటు పడాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తెలియచేశారు. సివి ఏ పి టీమ్ నందు యంగ్ ప్రొఫెషనల్ అయిన షేక్ మహ్మద్ ఫౌజాన్ తో పాటు సి వి ఏ పి టీమ్ సభ్యులు పాల్గొనారు.

## ఎరువుల దుకాణాలపై ఆకస్మికదాడులు నిర్వహించిన వ్యవసాయ అధికారులు

### సరియైనపత్రాలులేని 5 టన్నుల ఎరువులు గుర్తింపు.

**గుడ్లూరు, పెన్ పవర్, ఆగస్టు 23:**

మండలంలోని పలు ఎరువుల దుకాణాలపై వ్యవసాయశాఖ అధికారులు శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసుబ్రహ్మణ్యేశ్వర ఫెర్టిలైజర్స్, శ్రీసత్యనారాయణ ఫెర్టిలైజర్స్ మరియు శ్రీబాలాజీ ఫెర్టిలైజర్స్ ఎరువుల దుకాణాలలో ఎరువుల నిల్వలను తనిఖీచేసి, అనుమతి పత్రాలను పరిశీలించారు. ఈ తనికీలలో శ్రీసుబ్రహ్మణ్యేశ్వర ఫెర్టిలైజర్స్ దుకాణం నందు సరియైన పత్రాలను చూపని 5 టన్నుల కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ కి చెందిన 20.20.0.13 ఎరువుల బస్తాల నిల్వలను గుర్తించడం జరిగినదని, వీటి విలువ సుమారు రూ.1,28,000/- ఉంటుందని తెలిపారు. సరియైన పత్రాలు చూయించే వరకు వీటి అమ్మకం నిలుపుదల చేయడం జరిగినదని మండల వ్యవసాయ అధికారి బి.రవికుమార్ తెలిపారు. మండలం పరిధిలో ఎవరైనా సరియైన పత్రాలను లేకపోయినా, అధికధరలకు ఎరువులను విక్రయించిన, స్టాకు మరియు రేట్లతో కూడిన పట్టికను దుకాణం బయట బోర్డుపై చూయించక పోయినా చర్యలు తీసుకోవడంతో పాటు, లైసెన్స్ లను కూడా రద్దుచేయడం జరుగుతుందని వ్యవసాయ అధికారులు దుకానదారులకు హెచ్చరిక జారీచేశారు. ఈ కార్యక్రమంలో కావలి ఏడీఏ సీ.హెచ్.నాగరాజు, కందుకూరు మండల వ్యవసాయ అధికారి ఎస్.కె.అబ్దుల్ రహీం మరియు స్థానిక మండల వ్యవసాయ అధికారి బి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో డ్రోన్ శిక్షణా శిబిరం విజయవంతం



**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 23**

ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో స్మార్ట్ డ్రోన్ అభివృద్ధి %--% వస్తు అంతర్జాలం, కృత్రిమ మేధస్సుతో అనే ఆరు రోజుల శిక్షణా శిబిరం శనివారం విజయవంతంగా ముగిసింది. ఆగస్టు 18న ప్రారంభమైన ఈ శిబిరంలో మూడవ సంవత్సరం విద్యార్థులు విస్తృతంగా పాల్గొన్నారు. అటైన్ స్మార్ట్, ఎపిట్ పరిశోధన ప్రయోగశాలలు, హైదరాబాద్ భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ శిక్షణలో నిపుణులు కే. ప్రశాంత్, డి. విలియమ్, యం.డి మహమ్మద్ అబ్దుల్ బొహద్దిన్, విద్యార్థులకు డ్రోన్ రూపకల్పన, వస్తు అంతర్జాలం అన్వయాలు, కృత్రిమ మేధస్సు వినియోగంపై ప్రత్యక్ష ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇచ్చారు. కళాశాల ప్రతినిధి డా. కె. విజయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ పుస్తకాల జ్ఞానంతో పాటు పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు ఆచరణాత్మక అవగాహన కల్పించడం మా లక్ష్యం. భవిష్యత్తు ఉద్యోగ అవకాశాలకు కృత్రిమ మేధస్సు, డ్రోన్ టెక్నాలజీ, వస్తు అంతర్జాలం కీలకం. అందుకే మా కళాశాల తరచూ వినూత్న శిక్షణా కార్యక్రమాలను చేపడుతోంది. ఈ శిక్షణ విద్యార్థుల్లో కొత్త ఆవిష్కరణలకు మార్గం చూపుతుంది అని అన్నారు. ప్రిన్సిపాల్ డా. సి. హెచ్. రవికుమార్ మాట్లాడుతూ డ్రోన్ సాంకేతికత వ్యవసాయం, వైద్య సేవలు, రక్షణ, సర్వే రంగాలలో విస్తృతంగా ఉపయోగపడుతోంది. ఈ శిక్షణతో మా విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేస్తారని మాకు నమ్మకం ఉంది అన్నారు. విభాగాధిపతి డా. జి. సురేష్ మాట్లాడుతూ మా విభాగం ఎల్లప్పుడూ విద్యార్థుల ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించేందుకు కృషి చేస్తుంది. ఈ శిక్షణ వారిని పరిశ్రమల అవసరాలకు మరింత దగ్గర చేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ షాపు కోఆర్డినేటర్ మస్తాన్ వలి, విభాగ అధ్యాపకులు డా. హనుమంత్ రావు, రామ కోటేశ్వర రావు, శ్రీకాంత్, సోమినేని మాధవ, తదితరులు పాల్గొన్నారు. శిక్షణ ముగిసిన అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయబడ్డాయి. రిసోర్స్ పర్సన్స్ మాట్లాడుతూ ఈ శిక్షణతో విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ప్రావీణ్యం సంపాదించి, భవిష్యత్తులో ఉపాధి మరియు పరిశోధన రంగాలలో ముందంజ వేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

# ట్రంప్‌నకు మోది దాసోహం

## - నక్సలైట్ల అంతం పేరుతో గిరిజనుల హత్యలు
## - పోరాటం సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ
## - ఒంగోలులో ఘనంగా సిపిఐ 28వ రాష్ట్ర మహాసభలు













**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఆగస్టు 23**

అంతర్జాతీయంగా దేశాల మధ్య ఘర్షణలు సృష్టించి ఇరుదేశాలకు ఆయుధాలు సరఫరా చేసి యుద్ధాలను ప్రోత్సహిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కి భారత ప్రధాని నరేంద్ర మోది దాసోహం అయ్యాడని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ విమర్శించారు. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోకూడదని టారిఫ్ లు పెంచుతామని భారత దేశాన్ని బ్లాక్ మెయిల్ చేస్తుంటే ఎందుకు ప్రశ్నించడం లేదో మోది సమాధానం చెప్పాలన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర 26వ మహాసభలు ఒంగోలు నగరంలో శనివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. నగరంలోని పురవీధులలో మహా ప్రదర్శన నిర్వహించింది. అనంతరం గుజ్జుల యలమందారెడ్డి సరళాదేవి ప్రాంగణంలో జరిగిన బహిరంగ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య అధ్యక్షత వహించారు. ముందుగా స్వర్గీయ సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బహిరంగ సభను ఉద్దేశించి కే. నారాయణ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోది 11 సంవత్సరాల్లో 22 కోట్ల ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న కోట్లాది ఉద్యోగాలను ఊడగొట్టారని మండిపడ్డారు. స్విస్ బ్యాంకు నుంచి నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రతి ఒక్కరికీ 15 లక్షలు అకౌంట్లో వేస్తామని మోసం చేశారన్నారు. నక్సలైట్లను అంతం చేస్తామని పంతం పట్టిన మోదీ గిరిజనులను హత్య చేస్తున్నారని అన్నారు. అటవీ భూములను కార్పొరేట్లకు అప్పగించేందుకు గిరిజనులను దో చేస్తున్నారని పేర్కొన్నారు. నక్సలైట్లను హత్య చేసినంత మాత్రాన వారి సిద్ధాంతాన్ని అంతం చేయలేరని స్పష్టం చేశారు. నంబాల కేశవ్ ను చంపిన రోజే అదానికి 22 వేల ఎకరాలు భూమిని అప్పగించారని చెప్పారు. రాజ్యాంగబద్ధ వ్యవస్థలు తన నియంత పాలనకు అడ్డువస్తున్నాయని వాటిని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని అన్నారు. రాష్ట్రపతి పదవి గిరిజన మహిళకు ఇచ్చామని ప్రగల్బాలు పలుకుతూ ఆమె సంతకంతో గిరిజన వ్యతిరేక చట్టాలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నో మంచి తీర్పులను ఇచ్చిన సుదర్శన్ రెడ్డిని ఇండియా కూటమి నుంచి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలబడితే ఆయన నక్సలైట్ అని బిజెపి దుర్మార్గంగా ప్రచారం చేస్తోందన్నారు. 30 రోజులు జైలులో ఉంటే ప్రధానమంత్రి ముఖ్యమంత్రి వంటి పదవులలో ఉండరాదు అంటూ అమిత్ షా కొత్త చట్టాన్ని తీసుకొస్తున్నారని అన్నారు. ఈ చట్టం ద్వారా బిజెపికి వ్యతిరేకంగా మాట్లాడే వారిపై తప్పుడు కేసులు పెట్టేందుకు కుయుక్తులు చేస్తున్నారని పేర్కొన్నారు. జీఎస్టీ ద్వారా 22 లక్షల కోట్లు వసూలు చేశామని మోదీ గొప్పలు చెప్పుకుంటున్నారని, కార్పొరేట్ కంపెనీలకు 33 శాతం నుంచి 23 శాతానికి తగ్గించి సామాన్యులపై ఐదు శాతం నుండి 18 శాతానికి జీఎస్టీ పెంచడంపై సమాధానం చెప్పాలని కోరారు. మోది అధికారంలోకి వచ్చాక నిరుద్యోగం, నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటాయి అన్నారు. బీహార్ ఎన్నికలలో ఎలాగైనా గెలవాలని దొంగ ఓట్లను చేర్చుకొని ఉన్న ప్రతిపక్ష ఓట్లను తీసివేశారని పేర్కొన్నారు. ఇలాంటి దుర్మార్గ పాలన సాగిస్తున్న నరేంద్ర మోది ప్రభుత్వానికి చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్ రెండు కాళ్లుగా నిలబడడం సిగ్గుచేటు అన్నారు. సంవత్సరానికి మూడు పంటలు పండుతూ పచ్చగా ఉన్న పలాస లో 6వేల ఎకరాలు పోర్టుకు అప్పగించాలని చూడడం సమంజసం కాదు అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రోజుకు మాట పూటకో వేషం వేస్తూ సనాతన ధర్మాన్ని నెత్తికి ఎత్తుకొని తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీని గ్రామీణ స్థాయి నుండి బలోపేతం చేయాలని, చివరి క్షణం వరకు ప్రజా పక్షాన పోరాడిన సురవరం సుధాకర్ రెడ్డి ని స్ఫూర్తిగా తీసుకొని కార్యకర్తలు పోరాటపటిమను పెంచుకోవాలని సూచించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ సిపిఐ 100 సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ అన్నారు. వంద సంవత్సరాల కాలంలో పేదల కోసం త్యాగాలు చేసి, జైల్లోకి వెళ్లి, రక్త తర్పణ చేసిన పార్టీ సిపిఐ అన్నారు. ఎం స్వాతంత్ర్య పోరాటంలో దేశంలో పాల్గొన్న పార్టీలు రెండే అన్నారు. ఒకటి మహాత్మా గాంధీ ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కాగా, మరొకటి ఎర్రజెండా పార్టీ సిపిఐ అన్నారు. సిపిఐ తో పాటు ఆవిర్భవించినా ఆర్ఎస్ఎస్ ఏనాడు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదన్నారు. దొంగ ఓట్లతో బీజేపీ రాజ్యమేలుతుందన్నారు. రానున్న బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బిజెపికి తొత్తుగా మారిన ఎన్నికల కమిషన్ బిజెపికి వ్యతిరేకంగా ఓట్లు వేసే 65 లక్షల మంది ఓట్లను తొలగించిందన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో కూడా దొంగ ఓట్లు ద్వారానే కేంద్రంలోని బిజెపి అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రపంచంలోనే గొప్ప ప్రధాని మోడీ అంటూ చంద్రబాబు నాయుడు కితాబులు ఇస్తుంటే, జగన్ మాత్రం పులివెందుల ప్రజాస్వామ్యం అంటూ ఎన్నికల ప్రస్తావనలు తీస్తున్నారన్నారు. పవన్ కళ్యాణ్ అయితే సనాతన ధర్మం అంటూ, ఆర్ఎస్ఎస్ ఏజెండా తన ఎజెండా అంటూ బొట్లు పెట్టుకొని గుడుల చుట్టు తిరుగుతున్నారన్నారు. డబల్ ఇంజన్ సర్కార్ అని చెప్పుకుని చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో 22 సార్లు ఢిల్లీకి వెళ్లారన్నారు. అక్కడ మంత్రులను, ప్రధానిని, కలిసి ఏం సాధించారో చెప్పాలన్నారు. ఏడాది కాలంలో చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి సాధించిన అభివృద్ధి రూ. 75 వేల కోట్లు అప్పు అన్నారు. రాజధాని నిర్మాణం పేరుతో రూ. 32 లక్షల అప్పు తెచ్చారన్నారు. మరో 32 లక్షలు అప్పులు తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి నారాయణ పేర్కొంటున్నారన్నారు. మంత్రి, ముఖ్యమంత్రి వ్యాఖ్యలలో ఏది వాస్తవమో తెలపాలని డిమాండ్ చేశారు. 32 మంది ప్రాణం త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ పై చంద్రబాబు నాయుడు ఎందుకు ప్రశ్నించడం లేదని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు తెలుగు ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీక అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరిగితే చంద్రబాబు నాయుడు ను తెలుగుజాతి క్షమించదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలు కచ్చితంగా నెరవేర్చాల్సిందేనని డిమాండ్ చేశారు. రానున్న కాలంలో సిపిఐ పిలుపుమేరకు డబుల్ ఇంజన్ స్పీడ్ తో ప్రభుత్వంపై ఇళ్ల స్థలాలకు పోరాటం సాగించాలని, అందుకు ప్రజలు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాల నాగేశ్వరరావు, జె వి వి సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, పి హరినాథ్ రెడ్డి, జి ఓబులేసు, పి రామచంద్రయ్య, జగదీష్, కే వి వి ప్రసాద్, జంగాల అజయ్ కుమార్, డేగ ప్రభాకర్, ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ పి జె చంద్రశేఖర్, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్ నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# డీఎస్సీలో జిల్లా మూడవ ర్యాంకు సాధించిన కొమరోలు విద్యార్థిని హాజీజున్నిసా బేగం -పలువురి అభినందనలు

**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 23**

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో కొమరోలు కు చెందిన స్వర్గీయ షేక్ మొహమ్మద్ రఫీ ,షేక్ షమీమ్ ల ప్రథమ పుత్రిక షేక్ హాజీజున్నిసా బేగం ప్రకాశం జిల్లా స్థాయిలో ఎస్జీటీలో91 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో మూడవ ర్యాంకు సాధించింది. ఆ మేరకు నజీజున్నిసా బేగంను పలువురు అభినందిస్తున్నారు. కొమరోలు కు చెందిన షేక్ హాజీజున్నిసా బేగం కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్లో 2013- 14 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసి మంచి మార్పులతో ఉత్తీర్ణత సాధించింది. ఇంటర్మీడియట్ కోర్సును 2014-16 సంవత్సరాలలో కొమరోలు లోని శ్రీ ప్రగతి జూనియర్ కళాశాలలో పూర్తిచేసి అత్యుత్త మార్కులు సాధించింది. 2016 -18 విద్యా సంవత్సరంలో కొమరోలు మండలం తాటిచెర్ల మోటు లోని పద్మావతి డి.ఎడ్ కాలేజీలో టిటిసి పూర్తి చేసింది .కాగా 2018లో ప్రభుత్వం వేసిన డీఎస్సీ కొరకు కనిగిరిలోని టీచర్స్ అకాడమీ లో ప్రత్యేక శిక్షణ పొందింది. ప్రభుత్వం ఏడాది ప్రకటించిన డీఎస్సీ కొరకు ఇంటిలోనే స్వతహాగా తర్ఫీదు పొంది డీఎస్సీ ఎస్జీటీ విభాగం పరీక్షలకు హాజరైంది. శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి ఆలయం ప్రకటించిన మెరిట్ జాబితాలో హాజీమున్నిసా వేగం 91 మార్కులు తో జిల్లా స్థాయిలో మూడవ ర్యాంకు సాధించింది. దీనితో ఆమె



కుటుంబంలో ఆనందోత్సవాలు వెల్లి విరిసాయి. ఆ సందర్భంగా హాజీజున్నిసా బేగం పెన్ పవర్ ప్రతినిధితో తన సంతోషాన్ని పంచుకుంటూ ఈ సంతోష సమయంలో తన తండ్రి స్వర్గీయ మహమ్మద్ రఫీ జీవించి ఉండి తమ సంతోషంలో పాలుపంచుకొని ఉంటే తనకెంతో ఆనందం గా, తృప్తిగా ఉండేదని అంటూ తన తండ్రి స్వర్గీయ మహమ్మద్ రఫీని తలుచుకొని ఆమె భావోద్వేగానికి గురి అయింది. తన కష్టానికి ,తన తల్లి అందించిన సహాయ సహకారాలు, ఆశీస్సులతో పాటు తన భవిష్యత్తు కొరకు పరితపించిన విధానానికి ప్రతిఫలంగా అల్లా తనకు జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు కల్పించాడని హాజీజున్నిసాబేగం తెలిపింది. తాను ఉపాధ్యాయురాలిగా బాధ్యతలు చేపట్టి విద్యార్థులలో గట్టి పునాదులు వేసి వారి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ విద్యాశాఖకు వన్నె తెస్తానని వివరించింది .హాజీజున్నిసా బేగంకు డీఎస్సీ ఎస్జీటీ విభాగంలో జిల్లా స్థాయిలో మూడవ ర్యాంకు లభించడం పట్ల ఆమె కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ, హాజీజున్నిసా బేగంను అభినందించారు. కాగా స్వర్గీయ మహమ్మద్ రఫీ కి ముగ్గురు కూతుళ్లు కాగా రెండవ కూతురు తస్లీమ్ ఒంగోలులోని క్విస్ కాలేజీలో ఎంసీఏ చదువుతుండగా, చివరి కూతురు రిహాజ్ ఒంగోలులోని రిమ్స్ లో జి ఎన్ ఎం నర్సింగ్ కోర్సు చేస్తున్నది.

## ప్రజలు పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

### మునిసిపల్ కమిషనర్ నారాయణరెడ్డి



**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 23**

పొదిలి నగర పంచాయతీ పరిధిలోని ప్రజలు పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మునిసిపల్ కమిషనర్ కేవల్ నారాయణరెడ్డి కోరారు. శనివారం నాడు ఆయన దోమలను నియంత్రించేందుకు పట్టణంలో ఫాగింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు తమ ఇంటి పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అందువల్ల దోమలను నివారించేందుకు వీలు కలుగుతుందని ఆయన చెప్పారు. అలాగే ఇళ్లలో నీటి నిల్వలను అవసరమైన జాగ్రత్తలతో ఉంచుకోవాలని కమిషనర్ నారాయణరెడ్డి సూచించారు. వర్షాకాలంలో కూడా ప్రజలు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నారాయణరెడ్డి తో పాటు శానిటరీ ఇన్స్పెక్టర్ మారుతి రావు, సిబ్బంది పాల్గొన్నారు.

## కేజీబీవీల్లో విద్యా విప్లవం.. కార్యదర్శి సర్ప్రైజ్ విజిట్

- పిల్లలతో కూర్చొని అల్పాహారం, భోజనం -ఆహార నాణ్యతపై క్లారిటీ
- తరగతుల్లో నేరుగా పరీక్షలు, ఉపాధ్యాయులకు ఫలితాల అలర్ట్
- వసతులు, పరిశుభ్రత, ల్యాబ్‌లపై నిశిత సమీక్ష





**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ ఆగస్టు 23**

ముండ్లమూరు, తాళ్లూరు, కురిచేడు, పొదిలి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో శనివారం కేజీబీవీ కార్యదర్శి డి. దేవనందరెడ్డి ఆకస్మిక పర్యటన నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పర్యటన సాయంత్రం 4 గంటల వరకు కొనసాగి విద్యా, వసతి, పరిపాలన రంగాలపై సమగ్ర సమీక్ష చేపట్టారు.కురిచేడు విద్యార్థినులతో అల్పాహారం, ముండ్లమూరులో మధ్యాహ్న భోజనం చేస్తూ ఆహారం నాణ్యత, పరిమాణం స్వయంగా పరిశీలించారు. పిల్లలతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలు సేకరించారు. తరగతి గదుల్లోనే డిక్టేషన్ పరీక్ష నిర్వహించి విద్యార్థుల భాషా నైపుణ్యాన్ని అంచనా వేశారు. పదో తరగతి సహా ఉన్నత తరగతుల ఫలితాలు మెరుగుపడేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.వసతి గృహాలు, వంటశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలను తనిఖీ చేసి పరిశుభ్రత లోపాలపై వెంటనే సవరణలు చేయాలని హెచ్చరించారు. విజ్ఞానశాలలో పరికరాల వినియోగం పెంచి ప్రాక్టికల్ బోధన బలోపేతం చేయాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమావేశమై విద్యా ప్రమాణాల పెంపుపై దిశానిర్దేశం చేశారు.

## దివ్యాంగులకు అండగా కూటమి ప్రభుత్వం







**మార్కాపురం ఆర్.సి ఇన్చార్జి పెన్ పవర్ ఆగస్టు 23**

ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు.శనివారం పట్టణంలోని జడ్పీ బాయ్స్ హై స్కూల్ ప్రాంగణంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత ఉపకరణములను ఎమ్మెల్యే కందుల అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతులకు శిబిరాలు నిర్వహించి లబ్ధిదారులను గుర్తించడం జరుగుతుందన్నారు. అర్హులైన వారిని గుర్తించి వారికి వారి శారీరిక వైకల్యంబట్టి పరికరాలను రెండు నెలలలో పంపిణీ చేస్తామన్నారు. ప్రభుత్వం ప్రజలకు అండగా నిలిచే ప్రభుత్వమని అన్నారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
గుంటూరు । బాపట్ల । పల్నాడు

# పొగాకు రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఆగస్టు 23**

పొగాకు నాణ్యత లోపం అని చెప్పి పొగాకు రైతులను మభ్యపెడుతున్న అధికారులు సిపియం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య శనివారం స్థానిక కర్లపాలెం ఎఫ్ సి ఐ గౌడౌన్ పొగాకు కేంద్రం నందు ప్రజా సంఘాల నాయకులు,రైతులు నిరసన కార్యక్రము చేపట్టారు ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన .. అది నేటికీ నెరవేరలేదు పొగాకు కేంద్రాల అతి తక్కువ ధరకు పొగాకును కొనుగోలు చేస్తూ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు. రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామిలను వెంటనే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

## ప్రజలకు ఉచిత వైద్యబీమా అమలుపై

# కేంద్రం తక్షణమే దృష్టి పెట్టాలి

### అంగవైకల్య సమస్యలతో బాధపడే చిన్నారులకోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక వైద్యశిబిరాన్ని ప్రారంభించిన మాజీమంత్రి ప్రత్తిపాటి...









**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఆగస్టు 23:**

చిలకలూరిపేట : పుట్టుకతో వివిధ అంగవైకల్య సమస్యలతో బాధపడే చిన్నారుల సంక్షేమంలో భాగంగా వారికి ఉచిత విద్యతో పాటు.. వైద్యసేవల్ని అందిస్తున్న కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల కృషికి తమ వంతు సహాయ సహకారాలు అందించడం మనందరి బాధ్యతని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. పట్టణంలోని 7వ వార్డులో మద్రి చెన్నారెడ్డి మున్సిపల్ స్కూల్లో దివ్యాంగ చిన్నారుల కోసం పాఠశాలవిద్యాశాఖ, సమగ్ర శాఖ సహిత విద్యావిధానంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేకవైద్య శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ప్రత్తిపాటి విద్యార్థులు, ప్రజలు, వైద్య సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు.

**ప్రజలు కోరుకునేది నాణ్యమైన విద్య.. వైద్యమే**

కేంద్రప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడేలా, వారికి దేశంలో ఎక్కడైనా మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలు అందించేలా ఉచిత వైద్యబీమాను అమలుచేయాలని ప్రత్తిపాటి పునరుద్ఘాటించారు. రాష్ట్రాలను సంప్రదించి, వీలైనంత త్వరగా కేంద్రప్రభుత్వం ఈ దిశగా నిర్ణయం తీసుకోవడం వల్ల దేశంలో 80శాతం వరకు ఉన్న సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరగుతుందని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. ప్రజలు తమకు సకాలంలో నాణ్యమైన వైద్యసేవలు, ఉచితంగా లభించడాన్నే ఎంతో ఇష్టపడతారని, అలానే తమ పిల్లలకు మెరుగైన విద్యకూడా లభించాలని ఆశపడతారని ప్రత్తిపాటి చెప్పారు. అంగవైకల్య సమస్యలతో బాధపడే చిన్నారుల ఆరోగ్యరక్షణకోసం తనవంతు సహాయ సహకారాలు అందించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని ఈ సందర్భంగా ప్రత్తిపాటి తెలిపారు. చిన్నారుల ఆలనాపాలనా చూసే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారి సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే, వెంటనే స్పందించి ప్రభుత్వపరంగా అండగా నిలుస్తానని ప్రత్తిపాటి స్పష్టంచేశారు.

**చిన్నారులకు వైద్యసేవలు అందిస్తున్న వైద్యబృందాన్ని అభినందిస్తున్నాను**

పుట్టుకతోనే అంగవైకల్య సమస్యలతో బాధపడే చిన్నారుల ఆరోగ్య రక్షణార్థం కేంద్రప్రభుత్వం వారికి అందిస్తున్న వైద్యసేవలు నిజంగా చాలా బాగున్నాయన్న ప్రత్తిపాటి, చిన్నారులకు వైద్యసేవలు అందించడం కోసం ఢిల్లీ నుంచి వచ్చిన వైద్యబృందానికి అభినందనలు తెలియచేశారు. కొందరు వైద్యులతో మాట్లాడిన ప్రత్తిపాటి.. వారి ఆలోచనలు పంచుకొని, వారి సేవల్ని ప్రత్యేకంగా కొనియాడారు. అధికారులు ప్రజలకు అర్థమయ్యేలా తమసేవలకు సంబంధించిన విభాగాలు, పథకాలకు పేర్లు పెట్టాలని, అప్పుడే అవి త్వరగా ప్రచారంలోకి వచ్చి జనానికి త్వరగా అర్థమవుతాయని ఈ సందర్భంగా ప్రత్తిపాటి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పఠాన్ సమాధ్ ఖాన్, మద్దుమలా రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, జనసేన నాయకులు పెంట్యాల బాలాజీ, వార్డు కౌన్సిలర్ చెవిటిగంటి పార్వతీ, వార్డు నాయకులు షేక్ బాజీ, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వ్యర్థాలతో ప్రమాదం

### వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి. ప్రసూన రాణి




**పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఆగస్టు 23:**

ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను, ప్లాస్టిక్ వస్తువులను విచ్చలవిడిగా వాడటం వలన వాతావరణ సమతుల్యం దెబ్బతింటుందని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి. ప్రసూన రాణి అన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల ఆరోగ్యం మరియు పర్యావరణంపై కలిగే ప్రభావాలపై అవగాహన ర్యాలీని వ్యవసాయ కళాశాలలో ప్రారంభిస్తూ ఆమె గాలి నీరు మరియు మట్టి ప్లాస్టిక్ వ్యర్థాల వలన కలుషితం అవుతున్నాయని తద్వారా ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాల ద్వారా విషవాయువులు వెలువడి వాతావరణ కాలుష్యం రోజురోజుకీ పెరిగిపోతుందని, ప్లాస్టిక్ వ్యర్థాలు భూమి లోపల నిలిచిపోవడం వల్ల నేల కాలుష్యం కూడా పెరిగిపోతుందని దీనివల్ల పర్యావరణానికి హాని కలగటమే కాక ప్రజారోగ్యం దెబ్బతింటుందన్నారు. పర్యావరణానికి పెను సవాలుగా మారిన ఈ ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రజలు తగ్గించుకునేందుకు అవగాహన కల్పించేందుకై వ్యవసాయ కళాశాల విద్యార్థులచే పట్టణ వీధులలో ర్యాలీని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులను జనపనార సంచులను వాడవలసిందిగా ఆమె కోరారు.

# పెదగోల్లపాలెం జడ్పి హైస్కూల్‌లో ఘనంగా టంగుటూరి ప్రకాశం పంతులు గారి జయంతి వేడుకలు



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఆగస్టు 23**

కర్లపాలెం మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెదగొల్లపాలెం నందు ఘనంగా ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు గారి జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా హెచ్ ఎం పి.సుభాషిణి....మాట్లాడుతూ మేధావి, గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు త్యాగధనులు, పట్టుదల , స్థైర్యం కలిగిన మహనీయులు ఆంధ్ర కేసరి అని, విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. తెలుగు ఉపాధ్యాయులు నాగరాజు మాట్లాడుతూ ప్రకాశం పంతులు గారి జీవిత విశేషాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యం.దత్, బాపూజీ ఆదంబీ.పి.డి.వెంకటేష్ పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధ్యం.జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి.






**పెన్ పవర్, గుంటూరు, ఆగస్టు.23**

కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దటానికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. పరిసరాల పరిశుభ్రతను , పచ్చదనాన్ని , పర్యావారణాన్ని కాపాడటంలో ప్రజలదే కీలకపాత్ర అని ఆయన అన్నారు. స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర విజన్ లో భాగంగా 70, 71, 72 సచివాలయాల పరిధిలో విద్యార్థులు , ప్రజలతో కలిసి వర్షాకాలం పరిశుభ్రత పై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. తొలుత సచివాలయం సిబ్బంది , స్థానిక కూటమి నేతలు , ప్రజలతో కలిసి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో పారిశుధ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలతో చర్చించారు. విద్యాసంస్థలు, గృహ సముదాయాలు , పబ్లిక్ ప్రదేశాలలో పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను కోరారు. బీజేపీ మహిళా నాయకురాలు విమలాదేవి , భవానిలు మాట్లాడుతూ ఇళ్లల్లో , హోటళ్ళలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. మురుగు ఉన్నచోట దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని , పారిశుధ్య సిబ్బంది మురుగును ఎప్పటికప్పుడు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి దోమలు వ్యాప్తి కాకుండా చూడాలన్నారు. ప్రతీరోజు ఫాగింగ్ చేయాలన్నారు. ప్రజలు , అధికారులు కలిసికట్టుగా పనిచేసినప్పుడే కూటమి ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించగలమని డివిజన్ టీడీపీ అధ్యక్షుడు సాయి అన్నారు. అనంతరం వీధులను చీపుర్లతో శుభ్రపరిచారు. కార్యక్రమంలో కూటమి నేతలు అప్పిశెట్టి రంగా , వడ్డే సుబ్బారావు , సచివాలయం సిబ్బంది రమీజ్, శశాంక్ , రాజశేఖర్ , మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# సంప్రదాయ బద్దంగా, ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలను నిర్వహించుకోండి -ఎస్పీ సతీష్ కుమార్



**పెన్ పవర్, గుంటూరు, ఆగస్టు.23.**

ది.27.09.25 తేదీన వినాయక చవితి పండుగ సందర్భంగా పందిళ్ళు ఏర్పాటు మరియు ఊరేగింపు కార్యక్రమాల నిర్వాహకులకు పోలీస్ వారి సూచనలు . వినాయక “విగ్రహ ప్రతిష్ఠ పందిళ్ళు/మండపాలు ఏర్పాటు చేసుకోవడానికి 5 లేదా అంతకంటే ఎక్కువ మంది సభ్యులు కమిటీగా ఏర్పడి వారి వివరాలు సంబంధిత పోలీస్ స్టేషన్ లలో తెలిపి, వారి గుర్తింపు కార్డు నకలు కాపీలు పోలీస్ వారికి చూపించి అనుమతి పొందవలెను. ప్రైవేట్ లేదా పంచాయతీ/మున్సిపాలిటీకి సంబంధించిన స్థలాలలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయదలచిన వారు ముందుగా సదరు ప్రవేటు స్థలమైతే స్థల యజమాని అనుమతి, ప్రభుత్వ స్థలమైతే పంచాయతీ లేదా మున్సిపాలిటీ వారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. మున్సిపల్, ఫైర్, విద్యుత్ శాఖల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. వారు సూచించిన నియమ నిబంధనలకు అనుగుణంగా వినాయక చవితి పందిళ్ళు / మండపాలు ఏర్పాటు చేసి, అగ్నిమాపక చర్యల్లో బాగంగా వాటి వద్ద ఇసుక మరియు నీళ్ళను ఏర్పాటు చేసుకుని తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. మండపాలలో దీపారాధనల వలన మరియు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన అగ్ని ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు జాగ్రత్త వహించాలి. విగ్రహాల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, సమయం, నిమజ్జన మార్గం మరియు విగ్రహ నిమజ్జనానికి ఉపయోగించే వాహన వివరాలను విధిగా తెలియజేయాలి. లౌడ్ స్పీకర్లను రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు ఎట్టి పరిస్థితులలోను ఉపయోగించరాదు. భద్రత కొరకు రాత్రి సమయాల్లో మండపాల వద్ద విధిగా ఆర్గనైజింగ్ కమిటీ వారి ప్రతినిధులు కాపలా ఉండవలెను.రాత్రి సమయాలలో పందిళ్ళు/మండపాలు లో డబ్బులు, బంగారం లాంటి విలువైన వస్తువులు ఉంచరాదు. ప్రజలకు, ట్రాఫిక్ కు ఇబ్బందులు కలిగే విధంగా వినాయక పందిళ్ళు గాని, విగ్రహం పెట్టే ప్రదేశం గాని, బ్యానర్లు కాని, ఫ్లెక్సీలు గాని రోడ్డుపైన పెట్టరాదు. ఊరేగింపు సమయంలో ఇతర కులాలు, ఇతర మతాలకు,ఇతర రాజకీయ పార్టీల వారికి వ్యతిరేకంగా నినాదాలు చేయరాదు. వారి మనోభావాలను తెబ్బతీసే విధంగా ప్రవర్తించరాదు. పందిళ్ళ వద్ద మరియు ఊరేగింపు సమయాలలో అనుచిత ప్రదర్శనలు, అసభ్య నాట్య ప్రదర్శనలు జరుగకుండా మరియు మద్యం లేదా మత్తు పదార్థాలను సేవించిన వారు లేకుండా ఉండే విధంగా ఉత్సవ నిర్వాహకులు బాధ్యత వహించాలి. ఊరేగింపు సమయంలో పోలీస్ వారి అనుమతి లేకుండా ఎక్కువ శబ్దము వచ్చే వాయిద్యాలు అనగా డి.జే.లు, మందుగుండు సామాగ్రిని పేల్చడం మొదలుగునవి చేయరాదు. వినాయక ఉత్సవ కమిటీ మెంబర్లు నిమజ్జనానికి ఉపయోగించే వాహనం యొక్క పరిస్థితిని గమనించి మంచి కండిషన్లో ఉండే వాహనాన్ని మరియు లైసెన్స్, అనుభవం ఉన్న డ్రైవర్లను నియమించాలి. నిమజ్జనానికి వెళ్లే వాహనంపై మద్యం లేదా మత్తు పదార్థాలను సేవించిన వారు మరియు మైనర్ లు ఉండరాదు. శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం దృష్ట్యా నగరంలో ట్రాఫిక్ మళ్లింపులు చేయబడినవి కావున ఉత్సవ కమిటీ వారు తమ విగ్రహ ఊరేగింపు మార్గాన్ని పోలీస్ వారికి తప్పకుండా ముందస్తుగా తెలియ పరచాలి.దానికి అనుగుణంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీస్ వారు మీకు మార్గాన్ని కేటాయిస్తారు. ఊరేగింపు సమయంలో ట్రాఫిక్ ఇబ్బంది కలుగకుండా ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు ఉత్సవ నిర్వాహకులు తమ సభ్యులను కేటాయించాలి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా అర్జీదారుడు మరియు కార్యనిర్వాహకులే బాధ్యత వహించవలసి ఉంటుంది. పండుగ రోజు నుండి నిమర్జనం వరకు జరిగే పూజలు, వేడుకలు శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని ఉద్దేశంతో పైన నిబంధనలు సూచించడం జరిగింది. కావున విగ్రహాన్ని ఏర్పాటు చేసే నిర్వాహకులు లేదా కమిటీ సభ్యులు తప్పనిసరిగా పోలీస్ వారి నిబంధనలు పాటించాలి.ఏదైనా అవాంఛనీయ సంఘటనలు తలెత్తితే పూర్తి బాధ్యత నిర్వాహకులు లేదా కమిటీ సభ్యుల పైన ఉంటుంది. ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగే అవకాశం ఉంటే ముందుగానే సంబంధిత పోలీస్ అధికారులకు తెలియ పరచాలని ప్రజలకు సూచిస్తున్నాం. ప్రజలందరూ వినాయక చవితి పండుగను సంప్రదాయబద్ధంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలనీ కోరుకుంటున్నాం.

# అనుమతి లేకుండా డీజే సౌండ్స్ వాడితే కఠిన చర్యలు

### తాసిల్దార్ హుస్సేన్ ముందు హాజరు

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఆగస్టు 23**

వినాయక చవితి పండుగ సందర్భంగా అనుమతి లేకుండా డీజే సౌండ్స్‌ను ఉపయోగించవద్దని పేట రూరల్ ఎస్ఐ అనిల్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా, చిలకలూరిపేట రూరల్ పరిధిలోని డీజే బాక్సుల యజమానులను రూరల్ పోలీసులు తహశీల్దార్ షేక్ హుస్సేన్ ముందు హాజరుపరిచారు.ఈ సందర్భంగా తహశీల్దార్ షేక్ హుస్సేన్ మాట్లాడుతూ, “ప్రభుత్వ నిబంధనల ప్రకారం మాత్రమే డీజే సౌండ్స్‌ని ఉపయోగించాలి. అధిక శబ్దంతో వృద్ధులు మరియు పిల్లలకు ఇబ్బందులు కలిగించకూడదు. ఎవరైనా ఇష్టం వచ్చినట్లుగా నిబంధనలను ఉల్లంఘిస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకుంటాము” అని హెచ్చరించారు.డీజే యజమానులు కేవలం అనుమతి పొందిన శబ్ద పరిధిలోనే డీజేలను నడపాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అనితెలియజేశారు.



